కాలదోషం

[గత సంచిక తరువాయి]

[కథ]

శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి

3

'ఈసంవత్సరంఅంత ఎండలు ఏసంవత్సరమూ లేవు. మనుష్యులే ఆవకాయల్లాగు ఎండిపోతున్నారు' అనసాగారు సామాన్యప్రజ.

'అసలు ఢిల్లీలోనో కలకత్తాలోనో నిన్నను ముగ్గురు మనుష్యులు-ఇద్దరు చిన్నపిల్లలు, ఒక పెద్దమనిషిన్నీ చచ్చిపోయారని పేపర్లో పడిం'దని పత్రికాపాఠకులు విజ్ఞానాన్ని వెదజల్లేరు.

మధ్యాహ్నం మూడుగంటలవేళ, తూర్పుగదిలో మంచంమీద వెంకటనరసింహంగారూ, నేలను చాపమీద తలగడ పెట్టుకొని కామేశ్వరమ్మా పడుకొన్నారు.

ఇద్దరికీ నిద్రపట్టదు. ఇద్దరికీ ఏమో మాట్లాడాలనే ఉంది కాని, ఏమి మాట్లాడాలోమాత్రం స్ఫురించదు. గొంతు సర్దుకొని, ఏదో అందా మనుకొన్నా ఏదో వెలితిగా ఉన్నట్టుంది.

చాలాసేపు మంచంమీద అటూ ఇటూ దొర్లి, 'అబ్బబ్బ! ఏమిటీ గాడ్పు? ఎంత వేడిగా తగులుతూందో గాలి, హుఁ ఒకటే చెమట' అంటూ లేచి కూర్చున్నాడు వెంకటనరసింహంగారు, విసనకర్రతో జోరుగా భార్యకుకూడా కొంచెం తగిలేలా విసురుకుంటూ.

కామేశ్వరమ్మ పడుకొనే 'అమ్మాయి అత్తారింటికి వెళ్ళిపోవడం ఇల్లంతా చిన్నబోయింది. ఏమిటో ఏదో కొత్త ఇంట్లో తిరుగుతున్నట్టుంది' అంది.

'నిజమేనే, నాకూ అలాగే ఉంది; రోజుకి వందమార్లయినా నోటికి అమ్మాయీ అనే పిలుపు వస్తున్నది.'

'అదుంటే ఏవేవో పనులు కల్పించేది. ఏమీ లేకపోతే మధ్యాన్నమల్లా నవ్వు వినమ్మా అని ఎన్నో పుస్తకాలు చదివేది. ఎంతసేపూ చదువుకోడం, అల్లుకోడం, రాసుకోడం—అంతే. పాపం, అత్తవారింట్లో ఎలా మసులుకొంటున్నదో, ఎలా పనీ పాటూ చేసుకొంటున్నదో!'

'అమ్మాయికి పనిరాకేం! నువ్వు ఇంట్లో లేనప్పుడు ఇంటంతటి పనీ ఓఅన్నట్టు అవలీలగా చేసుకొనివచ్చేది కదూ!'

'అయితేమాత్రం, మనింట్లో చేసినట్టా! అత్తవారింట్లో అందర్నీ మెప్పించుకురావాలి. అందులో వాళ్ళదీ పదిమంది ఉన్న కుటుంబం అయెను. ఇంకా మొగుడు చదువుకొంటున్నాడు. అతనికీ స్వతంత్రం ఉండదు. మనపిల్లకి అన్నీ ఇక్కడ దానిష్టంమీదనే జరగటం అలవాటు. అక్కడ ఎల్లా నెగ్గుకొని వస్తున్నదో పిచ్చితల్లి. ఎంత మెతుకువగా ఉంటేనేం? పదిమంది ఉన్న కుటుంబంలో మాటపడిపోడం ఎంతసేపు?'

'నా కాభయం ఏం లేదుసుమా. అమ్మాయికేం మహారాజులాంటి సంబంధం. నిజంగా దాని అదృష్టమే. కాకపోతే, తాంబూలాలు ఇచ్చేస్తేమాత్రం అవతల మూడువేలు కట్నం ఇస్తామంటూంటే తిరిగి పోకపోవడం అదృష్టం కాక మరేమిటి?— అసలు, అల్లుడు మన అమ్మాయిని చూసేక, అవతల మూడువేలు కాదు, పదునాదువేలు కట్నం వచ్చినా, ఇంకొక సంబంధం చేసుకోనని పట్టుబట్టేడట. ఏదో, దాన్ని కని పెంచినందుకు ఒక అయ్యచేతిలో పెట్టేము. అంతే. కలకాలం పిల్ల మనింట్లో ఉండిపోతుందా?'

'ఆడపిల్ల ఇంట్లో ఉన్నా బరువే, మగపిల్లడు దూరంగా ఉన్నా బరువే. నా నాయన రాఘవులు ఒక్కడూ ఎలా ఉన్నాడో, ఏం చేస్తున్నాడో!'

'ఏం చేస్తాం? వాడికి మనం ఏమీ అన్యాయం చెయ్యలేదు. వాడికి ఏమహామహావాళ్ల పిల్లలకీ జరగనట్లు జరిపి చదివించేము. ఎన్ని కావాలంటే అన్ని పుస్తకాలూ బట్టలూ నా తల తాకట్టుపెట్టిఅయినా సమకూర్చవాణ్ణిగాని ఊరుకొనేవాణ్ణా? వాడికీ ఏం తెలివితేటలకి లోటులేదు. అయితే చివరికి వాడి బుద్ధి తప్పుదారి పడితే దానికి మనం ఏంచేస్తాము? ఇదేం కొట్టిచెప్పే వయస్సు కాదుకదా?'

'మీకెప్పుడూ వాడంటే కోపమే. వాడింట్లో కనబడేసరికల్లా మీరు ధూంధాంమని కేకలు వెయ్యబట్టే నాగమ్మ కంటికి కనబడకుండా వెళ్లిపోయేడు. వాడికేం బుద్ధా భూషణమా, వినయమా వివేకమా ఏది లోటు? వాడు చదువుకొనేరోజుల్లో ఇంతవాడు అంతవాడు అని మీరే పొగిడేవారు. మనవాణ్ణి మనమే తేలిగ్గా అనుకొంటే ఊళ్లోవాళ్ల కేం పోయింది, మరి నాలు గంటారు.'

'ఎందు కంటారు, నాయిష్టం నాకొడుకుని చేసేనంటాను, నన్ను నాకొడు కంటాడు, మధ్యను ఊళ్లోవాళ్ల కేం? కాని వాడు ఎంత రానన్నప్పటికీ నాకు అనుమానం ఉంది సుమా. నాజాతకం ఇప్పటి వరకూ ఒక్కపిసరు తప్పిపోలేదు. అంతా అక్షరాలా రుజువిచ్చింది. ఈ వయస్సులో బాగా, అసలు బ్రతికిన బ్రతుకంతటికీ హాయిగా సుఖపడే యోగం ఉందనే అంటున్నారు, చూసినవాళ్లంతా—ఇప్పుడు నాకు సుఖం అంటే ఏమిటి, అబ్బాయి ఇక్కడో అక్కడో ఏదో పెద్దఉద్యోగం చేసుకొని పెళ్లిచేసుకొని హాయిగా ఉండడంకంటే మరేమి టుంటుంది? నాకు పూర్తిఅయిన నమ్మకం ఉంది. ఈ కుజాంతరం అంత బాగుండదు గాని, రాహువు వచ్చినతరవాత మనం నిర్విచారంగా ఉండగలమని నా నమ్మకం. అబ్బాయి అప్పట్లో వచ్చితీరుతాడు.'

'అదే నానమ్మకమున్నూ. అందుకే, కావలిస్తే ఆ ఒక్క మడిచెక్క అమ్మేయండి; ఏదో బాంకులో పడేసుకొని, అందాకా పక్కగది, పిడికొట్టు, పెరటి వరండా అద్దె కిచ్చేస్తే ఎలాగోలాగు మనకి గడిచిపోదా అంటాను. తాతలనాటి ఇల్లు; ఇల్లమ్మడం నా కెంత మాత్రం ఇష్టంలేదు.'

'రామాయణం అంతా విని మళ్లీ మొదటికి వస్తే ఏంచెప్పడం? మనం ఇక్కడుండి చేసే దేమిటి చెప్పు. నాకా, ఉద్యోగం అయిపోయింది. ఇక పనీ పాటూ లేకుండా ఇక్కడా అక్కడా దేవిరించేకంటే ఆ పల్లెటూరేపోయి, ఆ నివేశనంలో ఒక మిద్దె కొంప నిలవేసుకొంటాము. చుట్టూ నాలుగుమొక్కలు వేసుకొని పాదులు పెట్టుకుంటే మనకి కావలసినంత కాలక్షేపం. చేతనయిందా ఆ మడిచెక్క కూడా సేరీపెట్టు కుంటాము. మన కిక్కడ ఇల్లెందుకు చెప్పు'.

'పోనీ, ఉంటే ఏమిటి నష్టం? అద్దె కిచ్చేస్తాం.'

'ఆఁ, అద్దె! ముందు దిగేదాకా పద్దెనిమిదీ ఇరవై ఇస్తామంటారు. తీరా దిగినతరవాత ఎనిమిదీ పదీ అని బేరాలుపెడతారు. ఇక మరమ్మత్తులనీ, అదనపు సదుపాయాలనీ దానిది దానికి సరిపెట్టేస్తారు. పైగా మిగిలినదేనా తిన్నగా మనియార్డరు కడతారా? ప్రత్యేకించి, రైలుఖర్చులు పెట్టుకొని వచ్చి వసూలుచేసుకోవడం మన కేం సదుపాయం?'

'పోనీ వాళ్లెంత పంపితే అంతే అయెను. అందరూ దుర్మార్గులే ఉండరుకదా? మళ్లీ అబ్బాయి గాని వచ్చి ఉద్యోగం చేసుకొంటే అద్దె కొంపలో ఉంటాడా?'

'వాడీఊళ్లోనే ఉద్యోగం చేస్తాడని నిబ్బరం ఏమిటి? అంతగా వాడే వచ్చి ఈ ఊళ్లోనే స్థిరపడితే అక్కడి మడిచెక్క అమ్మేసి ఏదో కొత్తఇల్లు కొనుక్కుంటాడు. వాడి కసలు మొదటినించీ ఈ యింటి పంపిణీ నచ్చలేదు. ఎత్తు లేకపోవడమూ, చిన్న ద్వారాలూ, కిటికీలుకూడా ఉన్నాయా లేవు అన్నట్టు ఉండడమూ—ఏనాడు కట్టినదో — ఇది ఇప్పట్లో వదల్చుకోవడమే మేలు.'

'అదీ సంగతి! మీకు అమ్మేయ్యాలని బుద్ధి పుట్టింది. ఇక దాని కనుగుణంగా ఎన్ని కారణాలయినా చెప్తారు.'

'అవు నదీ నిజమే. అవతలవాళ్లు చేతిలో డబ్బు సిద్ధంగా పట్టుకొని ఉన్నారు. అంతా ఆడవాళ్ల మేనేజిమెంటు. ఎంతయినాసరే ఇల్లంటూ దొరికితే చాలునని ఉన్నారు. కాబట్టే మనం ఎంతంటే అంత ఇస్తామంటున్నారుగాని, మనంతటమనం అమ్మజూపితే ఇందులో సగం రెండువేలయినా వస్తుం దని నమ్మకం లేదు ఏమంటావు?'

'మీయిష్టమే. నే న్చెప్తే వింటారుగనకనా?'

'ఎందుకు విన్ను? నే చ్చేసేది తెలివితక్కువ పని అయి, నువ్వు చెప్పింది సబబుగా ఉంటే తప్పకుండా వింటాను.'

'బాగానే ఉంది మీ మాట. ఎవళ్లు చేస్తున్నది వాళ్లకి అసందర్భంగా తోచద మెలాగు? ఒకవేళ తోచినా, ఇవతలివాళ్లు చెప్పింది సబబుగా ఉందని అనిపించద మెప్పుడు? అంతే, మంచో చెడ్డో, మీయిష్టమే చెల్లితీరాలి; మీపట్టుదలే వచ్చింది అబ్బాయికిన్నీ.'

'మగవా డన్నవాడికి పట్టుదల ఉండవలసిందే; కాని పాపం అక్కడ ఏమి ఇబ్బందిపడుతున్నాడో; వెర్రి అభిమానం. పదీ, పదిహేనూ పంపినా తిరగ్గొట్టేస్తాడేమో. ఊఁ. ఇలా ఎంత విసురుకొన్నా ఇంతే. నేను కాస్త మళ్లీ స్నానం చేసివస్తాను. ఈలోగా కాఫీ వేగం కానీ. ఇవాళ సాయంత్రంలోపుని పురోణీరాత అయిపోవాలి.'

౪

ఆ వేళ మెయిలు మద్రాసులో బయలుదేరడమే అరగంట లేటుగా బయలుదేరింది. మధ్యలో ఎక్కడో లైను చెడిపోయిం దని మరీ కొంత ఆలస్యం.

ఇప్పుడిప్పుడే కాస్త వెనకటి ఆలస్యాన్ని కూడదీసుకొని రావడానికి డ్రైవరు తాపత్రయ పడుతూఉంటే ఎవరో పడిపోవడం! కాలుకిమాత్రం దెబ్బ తగిలిందట—అక్కడితో కుదిరింది. దూరప్రయాణీకులకందరికీ బాధగానే ఉంది ఈ అడుగడుగునా వచ్చే అడ్డంకులమూలంగా. అయితే తక్కిన ప్రయాణీకులందరి బాధా, విసుగుదలా ఒకఎత్తూ, రాఘవరావు ఒక్కడి చికాకూ ఒకఎత్తూగా ఉంది. ఇలా రైలులో కూర్చోనేకంటే గబగబా నడిచివెళ్లిపోతే వేగం వెళ్లిపోగలనేమో అనికూడా అప్పుడప్పుడు అనిపించింది అతనికి. రాత్రి అంతా ఎలాగో గడిచిపోయింది. నిద్రపట్టకపోయినా కళ్లు మూసుకొని పడుకొంటే ఏవో కలలవంటి జ్ఞాపకాలతో గడిచిపోయింది. కాని తెల్లవారింది లగాయతు మరీ ఒంటరిగా ఉన్నట్టుంది. బండిలో మరీ తోడితొక్కిడిగా ఉంటే ఎంత కష్టమో ఒంటరిగా ఉండడమూ అంత బాధే. రాత్రి కొంత వరకూ సాయిబుగారయినా తోడున్నారు. పరస్పరం ఎక్కువ మాట్లాడుకోకపోయినా ఒకళ్లనొకళ్లు గమనించడంలో మరొకరుకూడా మనలాగే ఉన్నారన్న తృప్తి. అంతే. ఆయన దిగిపోవడంతో తన సెకండు క్లాసులోకి (అది ఇంటరుక్లాసు ఉన్న రోజుల్లోని సెకండుక్లాసు) మరి ఒక్క మనిషయినా ఎక్క లేదు. ఆ ఆంగ్లో ఇండియనుజంట తను ఉన్నాడనే ఈపెట్టెలో ఎక్క లేదు. మరొకటి వెతుక్కుంటూ వెళ్లిపోయేరు.

ఈప్రకారం వెళ్తే ఉదయం పదిగంటలకు దిగవలసింది—తాను సాయంత్రానికయినా వెళ్లగలడో, లేదో!

ముందుగా తను ఉత్తరం రాసిఉంటే—నాన్న స్టేషనుకి వచ్చి ఉండేవారేమో. ఉహుఁ, రాయకపోవడమే మంచి దయింది. ఇంత ఆలస్యం జరుగుతున్నందుకు ఆయన స్టేషనులో ఎంత అవస్థ పడవలసి వచ్చును!

అంతే కాదు, తను ముందుగా ఉత్తరం రాసినా, వైరుచేసినా ఆయన పదిమందితోనూ ఈమాట అనకమానరు. ఇక తనను ఏదో వింతమనిషిని చూడ్డానికి వచ్చినట్టుగా ఎందరోమంది పోగవుతారు. ఉహుఁ, తన ఉద్దేశం ఎంతమాత్రం అదికాదే. ఎవ్వరి కంటా పడకుండా [illegible]దల్లగా ఇంటికి వెళ్లి అమ్మ

తోనూ, నాన్నతోనూ హాయిగా ఇన్నాళ్లసంగతులూ మాట్లాడుకోవాలి. తర్వాత కావలిస్తే ఊళ్లో నలుగురు స్నేహితులనీ కలుస్తాడు.

అసలు తన నిప్పుడు అమ్మా నాన్నా గుర్తుపట్టగలరో లేరో! ఇంటికి వెళ్లేవేళకి మునుపటి ఆఅలవాటు దుస్తులు-చొక్కా పంచెమాత్రమే కట్టుకొని వెళ్లాలి. అనయినా అప్పటి బట్టలంటిటి ముతకరకం బట్టలు తన దగ్గర ఇప్పుడు లేనేలేవు. సరే బట్టలకేం, ఎటువంటివి కావలిస్తే అటువంటివి ఎంచుకొని కట్టుకోవచ్చును. కాని, అంతమాత్రంలో తను పన్నెండేళ్ల క్రితం రాఘవరావయిపోతాడా? ఈ పన్నెండుసంవత్సరాల్లోనూ ఎంతోమార్పు వచ్చిఉంటుంది తన మొగంలో, మాట తీరులో—ఒకంతట, తానే రాఘవుల్నంటే అమ్మా నాన్నా నమ్మగలరో లేరో!

ఎన్ని పువ్వులు! ఎన్ని పువ్వులు! అయ్యయ్యో' ఎంతలో దాటిపోయేయి. ఆఁ, లేదు, మళ్లీవచ్చేయి' అయితే ఇవి ఇందాకటి పువ్వులు కావు. వీటికి వాసన ఉందో లేదో, ఈరైలువాసనలో ఏదీ అందకుండా ఉంది. వాసన ఉన్నా లేకపోయినా మధువు కేం లోటు లేదు. లేకపోతే ఇన్ని సీతాకోక-చిలకలు సందడిగా ఎగుర్తాయా? నిజంగా సీతాకోకచిలకలదే నిర్విచారమయిన బ్రతుకు. తేనెతాగుతూ ఆడుకొంటూ పాడుకొంటూ పువ్వుపువ్వుకీ పరుగెత్తడమే కదూ ఉన్న పనంతా? కాని, ఈ సీతాకోక-చిలకగా మారడానికి ఎంత బాధపడింకో గొంగళిపురుగుగా ఉన్నప్పుడు? తనకయితే, గొంగళిపురుగు అసహ్యంగానూ, అది ఆకులను ధ్వంసంచేయడం అక్రమంగానూ, సీతాకోకచిలక చెట్టుచెట్టుకీ పువ్వుపువ్వుకీ ఉల్లాసంగా ఎగరడం ఎంతో అందంగానూ ఆనందదాయకంగానూ ఉండవచ్చునుగాని, వాటివాటి దృష్ట్యా రెండూ భుక్తిఅన్వేషణాక్రియనే నెరవేర్చుకొంటున్నాయి. రెంటికీ ఉండే ఆనందం ఒకటే కావచ్చును. తాను మునుపటి ఆ అవస్థలో పొందినకంటె ఇప్పుడేం తన్మయానందం పొందగలుగుతున్నాడా?

నిగనిగలాడే నల్లటి చాపరాతిమీద ఆ అమ్మాయి పిడకలు చరుచుకొంటున్నది. ఎంత శ్రమ, ఎంత శ్రమ. పగల్లా చేస్తే ఎంతపేడ జాగ్రత్తపెట్టగలదో, ఎన్నిపిడకలు పెట్టగలదో; వంద ఎంతకి చెల్లుతాయో? ఈపల్లెటూళ్లలో కొనేవాళ్లెవళ్లు? ఎరువుగా పనికివచ్చే పేడను ఇంత శ్రమపడి వంటచెరుక్కింద తయారుచేసుకోవడం ఏమి తెలివితేటలో! శరీరానికా శ్రమ, పొలాలకా సత్తువ చాలకపోవడం! అంతలో అతనికి జ్ఞాపకం వచ్చింది, తానప్పుడు అనుకొంటున్నవన్నీ వారంరోజులక్రిందట తాను చదివిన సాంఘికారోగ్యశాస్త్రగ్రంథంలోని అభిప్రాయాలేగాని తన స్వంతం కావని. కాని, వెంటనే మనసు మరొకదారి తొక్కింది. చిరకాలంనుండి వస్తున్న ఈ అలవాటులో ఏదో తనకు తెలియని ఆనందం ఉందేమో—లేకపోతే, అంత ఉల్లాసంగా పాడుకుంటూ ఎలాగ చెయ్యగలదా నల్లకలువలకన్ను రేకులకాపుపిల్లది. ఎండో తనవలె రైలులో ఒంటరిగా కూర్చొని, ఇన్ని సంవత్సరాలుగా విడిచిపోయిన ఇంటినీ తల్లితండ్రులనీ చెల్లెళ్ళనీగురించి ఆలోచించనూ మాననూ లేక ఆలస్యానికి ఆరాటపడే వాడికి ఆఅమ్మాయి చేస్తున్న పనిలో సుఖమూ ప్రయోజనమూ కనిపించకపోవచ్చును.

దబ్‌దబ్‌దబ్..దబ్‌దబ్-దబ్‌దబ్‌దబ్‌దబ్..ధ్వనిలో ఒక నిత్యగతి లేదు. ఉన్ననీళ్లే కొద్దిగా ఉన్నాయి. అవీ శుభ్రంగా లేవు. వాటిలోనే ఊరిమురికినంతటినీ వదలగొట్టుతున్నారు రజకకులాలంకారులు. ఉదయం మొదలు ఆసాయంతనమూ ఉతికితేకూడా తిండికి చాలీచాలకుండా ఉంటుంది. పాపం, ఒక్కనిమిషం రైలువంక చూసి మళ్లీ పనిలో పడుతున్నారు. వీళ్లను ఇంత శ్రమకు పాలుచేసి పూటపూటా కొత్తబట్టలు కట్టుకోవడమూ దుర్మార్గంలాగే ఉంది; అలాగని, ఎవళ్లపని వాళ్లే చేసుకొని వీళ్లకు అసలే పని (అంటే తిండి) లేకుండా చేసీ ఫలితం లేదు. తక్కువమంది మనుష్యులు తేలికగా పనిచేయడంతో ఎక్కువ మురికిని వదలగొట్టగలగాలి; ఈలోపుని తక్కిన ఈవృత్తి నవలంబిస్తున్న మనుష్యులకు జీవితం సమస్య అయిపోకూడదు. ఏదో కొత్తరహాదారీ ఏర్పాటు కావాలి. బాగా ఉతికి చలవచేసిన తెల్లటిబట్టలను కట్టుకోవ

డంలోమాత్రం ప్రజలకు తృప్తీ సుఖమూ లేవా! తానూ ప్రజలను ఆనందింపచెయ్యడంలోనే జీవికను సంపాదించుకొంటున్నాడు. సాంఘికోపయోగ దృష్ట్యా రెండూ ఒక్కరకంవే. అయితే తాను రైల్లో హాయిగా విశాలంగా ప్రయాణం చేయగలుగుతున్నాడు; చాకలికి ఎప్పుడోగాని రైలెక్కే అవకాశమే కలగదు; కలిగిననాడయినా-తక్కువ ప్రయాణీకులు జాగా ఉన్నా లేదులేదు నిలబడమనో, కిందకూర్చోమనో గదమాయిస్తారు. ఎంత వ్యత్యాసం!

తరవాత కొంతసేపటికి, అతనికి తన ఊహాప్రవాహంలోని వక్రగతి బోధపడ్డది. లేదా, అలాగని అతను తృప్తిపడగలిగేడు. వ్యత్యాసం ఉన్నమాట వాస్తవమే. కాని తానుకూడా ఎప్పుడూ ఇలాగే ఉండలేదు. ఈస్థితికి రావడానికి, నిబ్బరమయిన బ్రతుకుబాటను విడిచి ఆశల ఆశయాల దుర్గమపథాన్ని అనుసరించడానికి ఎంతమాత్రమూ వెనుదీయలేదు. ఒకరవ్వంత అటూ ఇటూ అయితే ఎంతటి అగాధంలో పడిఉండునో ఊహించబడదు. తల్లిదండ్రులకీ బంధువులకీ స్నేహితులకీ పరిచితులకీకూడా భారంగా తోచిన రోజులు—రోజులు కాదు, అత్యంతదీర్ఘమయిన సంవత్సరాలే-తన జీవితంలో ఎన్నో గడిచేయి. ఎక్కడా స్థిరమయిన ఆధారం లేక, ఆశలనూ ఆశయాలనూ వదులుకోలేక, అలాగని కోర్కెలకి విరుద్ధంగా బ్రతకాలని లేక, అప్పుడప్పుడు ఆపూట భోజనానికే ఆరాటపడే ఆరోజుల్లో ఎన్నిపర్యాయాలు తను ఆత్మహత్యచేసుకోదల్చుకొన్నాడుకాదు. అయితే, అపజయాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకొన్నాడన్న అవమానపు భయమే తనను సంరక్షించింది. కాని, చచ్చిపోయినవాడికి అవమానంతోనూ, ప్రతిష్ఠతోనూ పనేమిటి? ఇదంతా ఆతర్వాత తెలుస్తుందా? అబ్బే, అప్పుడు తనకు ఆత్మహత్య చేసుకోవాలన్న కోరికకంటె, బ్రతకాలనీ, తన కలలు నిజమయితే సంతోషించాలనీ అన్న కాపీనమే ఎక్కువగా ఉండేదేమో?

ఏదయితేనేం, తన కిక అవమానభయం లేదు. తన తాపత్రయంలో, వినోదంలో తానుండి, ముసలి తల్లిదండ్రులు కష్టపడుతూఉంటే చూసి ఊరుకొన్నాడన్న అపకీర్తి తన కిక ఉండదు. ఇన్నాళ్లూ తానీ లక్ష్యంతోనే కృషిచేసేడన్నా లోకం మరేమీ అనదు. నాన్న తన యాభై అయిదేళ్లలోనూ ఆర్జించలేని, ఆర్జించడానికి వీలవుతుందని ఊహించనైనా లేనంత డబ్బు తానీ మూడేళ్లలోనూ ఆర్జించేడు. అదంతా తనకని ఏమీ ఉంచుకోకుండా ఇచ్చివేయడానికి ఎటువంటి అభ్యంతరమూ లేదు.

రాఘవరావుకి, తనతల్లిదండ్రులంటె ఏకొంచెమో శారీరకంగా మారితే మారిఉంటారుతప్ప, మానసికంగా తాను ఇంటిని విడిచిపెట్టిననాడు ఉన్నట్టే ఉంటారనీ, తనలోని అన్నిలోటుపాట్లకంటె అతిప్రధానమయినది డబ్బు ఆర్జించలేకపోవడమే అనుకొంటూ ఉంటారనీ తోచింది.

లోపల్లోపల అతని కింకొక చమత్కారమయిన ఉద్దేశంకూడా అస్పష్టంగా ఉంది. తాను ఇంటికి వెళ్లిన వెంటనే కొంతసేపు తన స్థితి యథాపూర్వంగానే ఉందని నటిస్తే—ఇప్పటికీ ఇంకా తన ఆశలు కొనసాగకపోయినా, ఉద్యోగం చెయ్యడం అంటే అయిష్టంగా ఉన్నట్టూ, అక్కడ తను సుమారు వెయ్యి రూపాయిలు అప్పుతీర్చవలసిఉందనీ, లేకుంటే మళ ప్రవేశం చెయ్యవలసివస్తుందనీ తమాషా చేస్తే—! అంతా ఏమిటో, ఒక స్ఫుటంగా ఒక నిశ్చయంగా ప్రసరించకుండా ఉంది మనస్సు. ఎలా అయితే అలాకానీ - ముందిల్లంటూ చేరుకుంటే తక్కినవన్నీ వాటంతట అవే తేలిపోతాయి.

అతని ఆతృతవల్లనయితే ఎంతో ఆలస్యం అయినట్లుగా తోచిందికాని నిజంగా అయినది నాలుగు గంటల ఆలస్యం మాత్రమే.

స్టేషనులో తన్ను ఎవరూ గుర్తించలేదు. నయమే! లేకుంటే అనవసరపు హంగామా!

బండీలో ఇంటికి వెళ్తున్నంతసేపూ అతనిమనస్సు పరిపరివిధాల భావించసాగింది. నాన్న ఈసరికి ఏం చేస్తూ ఉంటారో? మధ్యాహ్నం భోజనం అయి,

చుట్ట కాల్చుకుంటూ ఉంటారుకాబోలు. అమ్మ ఎల్లా ఉందో!—ఇంతసేపూ తనను వాళ్లు గుర్తించగలరో లేకో అనే ఆలోచిస్తున్నాడు. వాళ్లు తనచేత గుర్తించబడే స్థితిలో ఉన్నారో లేకో? తాను మంచివయస్సులో ఆరోగ్యంగా ఉంటూఉండికూడా ఆర్థికమయిన చిక్కులమూలాన అప్పుడెంత ఇబ్బందిపడ్డాడు కదా, వాళ్లు పాపం ముసలికాలంలో, తన ప్రాపు లేక ఎటువంటి అవస్థలు పడుతున్నారో? తాను ఇన్నాళ్లూ ఉత్తరమయినా రాయలేదు. ఏమో, అకస్మాత్తుగా ఒక్కనాడు వచ్చి, తన ప్రతాపం ప్రదర్శించి విభ్రమింపచేయాలని ఎప్పటికప్పుడు అనుకుంటూ ఇప్పటివరకూ గడిచిపోయింది. పోనీ, ఇదివరకు పడ్డంతకాలం మరి కష్టాలు పడరుకదా! ఒక్కటే విచారం - అప్పుడు డబ్బుకు వొక్కడుపడిన పరిస్థితుల్లో చెల్లెమ్మకి ఎటువంటి సంబంధం చేసేరో—ఆసమయంలో తాను ఇంటిదగ్గర ఉండి చేయగలిగినదేమిటి? ఏమీ లేదు. ప్రస్తుతం తాను తనపనిని నిబ్బరంగా చేయగలుగుతున్నాడు గనక, తనచేతనయిన సహాయం అంతా చేస్తాడు. అంతే. అంతకంటే ఎక్కువగా బాధ్యత తనకి ఉందనుకొని నీరసపడడం కట్టి తెలివితక్కువ.

పాతవీథులూ, పాతఇళ్లే కొత్తకొత్తగా కనిపిస్తున్నాయి. కొన్నికొన్ని స్థిరమయిన గుర్తులే కనబడడంలేదు. గురయ్యకిళ్లీలకొట్టు ఈసందుచివరనే ఉండేది. ఆర్. నటరాజన్ కాఫీహోటలుకూడా ఇక్కడ ఉండవలసింది. టక్ టిక్ టక్ మని ఈ వ్రడంగిషాపు ఎలా వచ్చిందో! పాపం! నాయుడికి తాను పదో పన్నెండో ఇవ్వవలసిఉండేది. ఈవూళ్లోనే ఇంకొకచోట ఎక్కడయినా హోటలు పెట్టేడేమో కనుక్కోవాలి.

అంతసేపూ ఎప్పుడెప్పుడు ఇంటిని చేరుకొంటానని తొందరపడిన రాఘవరావుమనస్సు తీరా వచ్చేక మరికొంచెంసేపు బండి నడిస్తే బాగుణ్ణనిపించింది.

ఇల్లేమీ ఎక్కువగా పాతబడినట్లు లేదు. అక్కడక్కడ కొద్దిగా మార్పులు చేయబడినట్లున్నాయి. శుభ్రంగా వెల్లవేసిఉంది. పండుగకి కాబోలు వేసేరు. మరేమీ విచారం లేదు. తాను భయపడుతున్నంత దారిద్ర్యంతో మగ్గిపోలేదు తన తల్లిదండ్రులు. అంతకంటే తన కేం కావాలి? చెల్లెమ్మకూడా ఉందేమో?

ఆఁ, అదుగో, అఁహాఁ, చిన్నపిల్ల. పధ్నాలుగేళ్లకంటె ఎక్కువ ఉండవు. చెల్లెమ్మకి సుమారు ముప్ఫై ఏళ్లుండాలి. తనకంటె అయిదారేళ్లేకదూ చిన్న. చెల్లెమ్మకూతురేమో? ఇంతకూ తనుండడానికి వీలుందా? ఏమో ఇన్ని సంవత్సరాలలో ఎన్నివింతలు జరగడానికి సావకాశం లేదు? తానింతలా మారిపోయేడు కదా!

బండి ఆపమన్నాక అతనికి అంతసేపూ కలగని ఒక పెద్ద సందేహం కలిగింది. తాను మెట్లెక్కుతూ ఉంటే ఆ అమ్మాయి కొంచెం సిగ్గుపడింది కాబోలు, లోపలికి పారిపోయింది. అమ్మాయ్, మీతాతగారూ, వాళ్లూ ఉన్నారా అడగాలనిపించింది. కాని వినిపించుకొంటేకదూ—తన సిగ్గే తనది.

తానంటే తెలివితక్కువగా ఇంతకాలమూ తల్లిదండ్రులు ఎప్పటిలాగే ఉన్నారనకొంటున్నాడుగాని, ఈలోపుని ఎన్నిమార్పులు జరిగేయో వాళ్ల జీవితాలలోనూ. తాను లోపలకు వెళ్లడమా, మానడమా? ఇంత మేరావచ్చి, సంగతేమిటో కనుక్కోకుండా తిరిగిపోతే ఏం ఫలితం? ఆఁ, ఎవళ్లో వస్తున్నారు. తన అనుమానమే నిజం. ఒక సుమారు నలభైఏళ్ల పూర్వసువాసిని, కళ్లజోడు, ఎఱ్ఱ చెంగావిపంచ-ఒక సుమారు పాతికసంవత్సరాల యువకుడు, ఇందాకటి అమ్మాయి, అంతకంటె నాలుగైదేళ్లు పెద్దయిన ఇంకొక అమ్మాయీ. ఇందరి దృగంబకాలూ ఒక్కసారిగా తనమీద పడ్డాయి. రాఘవరావుకి ఏమిటి మాట్లాడాలో తోచలేదు. తన ఆలోచన అంతా ఇలా విఫలమయిపోయింది. వీళ్లతో తనకు ప్రస్తుతం ఏమి పని ఉందనడం?—వీళ్లను అడిగినా వీళ్లకు తన తల్లిదండ్రుల సంగతి ఏమీ తెలియకపోవచ్చును. ప్రస్తుతానికి ఏదో హోటలులో బసచేసి, తరవాత కేశవరావునో, శర్మనో అడిగి కనుక్కోవచ్చు ననుకుంటూ వెనక్కు తిరిగేడు.

కాని, ఎఱ్ఱచెంగావిపంచెఆవిడ ఊరుకోలేదు. 'ఎవరు నాయనా, ఇల్లు పొరపాటుపడ్డావుకాబోలు! వాడూ నాలుగయిదేళ్లాయి రాలేదు. వస్తాడని రెండు రోజులనించీ ఎదురుచూస్తున్నాం. మా చిట్టి చూసి వచ్చేడంటే వాడే అనుకొన్నాం. ఎవరిల్లు కావాలి బాబూ, మాకు తెలుస్తుందేమో చూస్తాం.'

రాఘవరావుకి అంతలో దొరికిపోవాలనిపించలేదు-'నాకాఅండి? ఇది పూర్వం మావాళ్లుండే ఇల్లు; ఉండేదేమిటి, అప్పుడు స్వంతఇల్లే. అంటే సుమారు పన్నెండు సంవత్సరాలక్రితంవరకు నాకు తెలుసును. తరవాత, ఇది మీస్వంత ఇల్లే వనుకొంటాను.'

'కాదు నాయనా. మేము అద్దెకే ఉంటున్నాము. ఏదీ ఇంకా అన్నెల్లు కాలేదు మేమిందులో దిగి. అప్పుడే ఖాళీచేసేయమంటున్నారు.'

'అమ్మో! అలాగా? ఇప్పట్లో ఈ అద్దెఇళ్లతో ఉన్న చిక్కే ఇది. కాని, ఇంటివారు ఎక్కడ ఉన్నారో తెలుసునా అండి—మావాళ్ల సంగతి చెప్పగలరేమో'.

'ఇంటివారా? పక్కవీధిలోనే ఉన్నారు. ఎవరో కోమట్లట బాబూ—వారూ, మేమిందులో దిగేముందే ఎవరో సాయిబులదగ్గర కొన్నారట'.

'అలాగా. అంటే చాలా చేతులు మారిందన్నమాట. వాళ్లకి తెలుస్తుందో తెలియదో. పన్నెండేళ్లక్రిందటి పరిస్థితి. నాదే పొరపాటు. ముందు సరిగ్గా కనుక్కోకుండా, అంతా ఎప్పటిలాగే ఉంటుందనుకొని రావడం—మీకు అనవసరంగా శ్రమ ఇచ్చేను. వస్తానండి' అని మెట్లు దిగబోయేడు.

ఆవిడకు కష్టంగా తోచింది. 'పోనీ పెద్దవుగాని నాయనా, నువ్వూ మా మేనల్లుడులాటివాడివే. ఎంత దూరంనుండి వచ్చేవో? ఈపూట మాయింట్లో భోంచేసి, తరవాత తాపీగా కనుక్కోవలసిన వాళ్లను కనుక్కొందువు గాని—ఈ సామాను పట్టించుకొని ఇప్పుడు ఎక్కడకని తిరుగుతావు?'

'బాధ లేదు. ఎక్కడన్నా హోటలులో బస చేస్తా' నన్నాడు కొంత లొంగిపోవాలనుకొంటూనే రాఘవరావు.

ఆవిడ ఊరుకోలేదు. ఆహ్వానాన్ని రెట్టించింది. ప్రక్కనున్న యువకుడుకూడా ప్రోత్సాహంగా 'ఇప్పటికి ఉండిపోండి సార్, తరవాత నేనూ వస్తాను; అలా మనం వెళ్లి కనుక్కొందాం' అన్నాడు. వెనకనుండి వస్తున్న మంజులాలోకనమాలికాపుంజంకూడా అలాగే అంటున్నట్టనిపించింది. అంతసేపూ నీరసంగా ఉన్న జట్కామనిషికూడా అదే ఉచితమని సలహా ఇచ్చాడు—అతనికి డబ్బులిచ్చేస్తూ మరొక రెండు గంటలు పోయేక తీసుకొని వస్తే అలా వెళ్లాలి అని. అందరి వెనకా తను, తన వెనక ఆయువకుడుగా లోపలికి ప్రవేశించాడు.

ఆనాటి ఆతిథ్యం తనకి నాటికీ నేటికీ వింతగానే రూపిస్తుంది రాఘవరావుకి.

నిజంగా ఇన్ని చేతులు మారినా ఇల్లు అట్టే మార్పు చేయబడలేదు. వీధికిటికీ కొంచెం పెద్దది కావడం, శుభ్రంగా వెల్లవేసి ఉండడం ఎంతో మార్పు జరిగిందేమో అనిపించింది తనకి. అంతే—

తన పుస్తకాలకూజా అలాగే ఉంది. అంతే కాదు, అప్పుడు తను ఇంటర్మీడియటురోజుల్లో కత్తితో చెక్కిన పేరు అలాగే ఉంది. ఇందాకా స్నానం చేస్తుంటే కనిపించింది. అప్పుడు తను ఎంతో శ్రమపడి సంపాదించి, వేసిపెంచిన సంపెంగమొక్క ఇప్పుడు బాగా పెరిగి పెద్దవృక్షమయింది. గంపలకొద్దీ పూస్తున్నట్లుంది. అలా కొంతసేపు తానా ఇంటిలో ఒంటరిగా ఉండేసరికల్లా, ఇన్ని సంవత్సరాలూ ఎడతెగకుండా తానందులోనే ఉంటున్నట్లనిపించింది. అంతేకాదు, కొంచెం పరధ్యానంగా తానుంటే, 'అమ్మా! చెల్లెమ్మా!' అని తాను పిలిచేస్తాడేమో అనికూడా అనిపించింది.

ఆ వేళ—సరిగ్గా ఈ గదిలోనే, అమ్మ కూర తరుగుతూంది. తాను కుర్చీలో కూర్చున్నాడు; చెల్లెమ్మ

మంచంమీద విసుకుగా లేచిపోతున్నట్లుగా కూర్చుంది; నాన్న అతి ఆవేశంగా అటూ ఇటూ పచారుచేస్తూ, 'ఏదో ఒకటి తేలిపోవా లివాళ, ఎన్నాళ్ళీవెధవ వేషాలు' అన్నారు.

అమ్మకీ చెల్లెమ్మకీ తనంటే అంతులేని నమ్మకమే—కాని, లోపల్లోపల, నాన్న ఉద్దేశాలే నిజమేనేమో ననే భయంకూడా లేకపోలేదు.

'తిన్నగా బుద్ధిగా నుండు ఆపరీక్ష పూర్తిచేసి, నౌకరీ చేసుకుంటేనే నాయింట్లో ఉండడం. లేకపోతే ఏకంగా అవతలకి నడవవలసిందే. ఈ వెధవ వేషాలు మరి సాగడానికి వీల్లేదు. ఈపాటికి తాను నౌకరీచేసి నన్ను కూర్చోబెట్టవలసిన వయస్సొచ్చింది. నేను నా పదహారోఏట నౌకరీలో ప్రవేశించేను. పాతికేళ్లు వంటిమీదికి వచ్చీ.........'

అలా నాన్న ఉపన్యాసం సాగిపోతూంది. కోపములో తన వయస్సుకూడా పెరిగిపోయినట్లు తోచిందినాన్నకి...తనకీ లోపల్లోపల ఉడికిపోతూంది. అమ్మా, చెల్లెమ్మాగాని దగ్గర ఉండకపోతే, తానూ మాటకు పదిమాటలు అనిఉండేవాడే. అంటే, నాన్న మరీ విజృంభించిఉండును. తరవాత ఏమో, ఎంతవరకూ వెళ్లిఉండునో?

తాను తలవంచుకొని అవతలకి వెళ్లిపోతూంటే, అమ్మ 'ఎందుకండీ అలా అంటారు? వాడే చిన్నబోయి ఉంటే. కోపం వచ్చి ఈచూరు మరి రాకుండా ఎక్కడికయినా వెళ్లిపోతా'డంది.

అప్పటికీ తను ఒక నిశ్చయానికి రాలేదు. కాని, వీథిగుమ్మంలో తానుండగా గట్టిగా తనకు వినబడాలనే నాన్న అన్నమాటలు—'వెళ్లనీ, వెళ్తే వాడు కొడుకే లేడనుకుంటాను—ఎక్కడికి వెళ్తాడు? చెల్లని దమ్మిడీ ఎక్కడికి వెళ్లినా ఒకటే. ఈమాటుగాని, వాడికి ఏమయినా ఇచ్చావంటే చూడు...' అవే తనని తరవాత కాపాడాయేమో!

ఆసాయంత్రమే వెంకటనారాయణ (పాపం, తరువాత ఏడాదికే చచ్చిపోయేడట.) దుకాణంపెట్టె లోంచి తీసి ఇచ్చాడు. 'పాతిక చాల్నా? పోనీ మరో అయిదుకూడా ఉంచనీ. నే నెలాగో సర్దుకొంటాను. నీ కెప్పుడు వీలయితే అప్పు డివ్వుగాని. అక్కడగాని ఎప్పుడయినా అంత ఇబ్బందిగా ఉంటే, రాయి—ఏమయినా వీలయితే చూస్తాను.' అన్నాడు.

అంత అభిమానంగా అత డివ్వబట్టే, అక్కడ తనచేతికి వచ్చిన మొట్టమొదటి యాభైరూపాయిల లోనూ అతడి ముప్ఫై పంపించేసేడు. లేకుంటే తక్కిన చిల్లరబకుళ్ళలాగే మరిచిపోవును. ఏమయితేనేం, అప్పుడు పంపించగలగడంవల్ల తాను అదృష్టవంతుడు. లేకుంటే, ఆతర్వాత కొద్దినెలలకే అతను పోయేడట. తన మనస్సు ఎప్పటికీ బరువుగా ఉండును. ఇప్పుడు మాత్రం లేదూ? అటువంటి సహృదయుడయిన స్నేహితుడు పోయినందుకు. అయినా ఇది వేరు.

అప్పుడు తనని ప్రోత్సహించినవాళ్ళూ, దిగలాగినవాళ్ళూ అందరూ ఇప్పుడు ఆత్మీయులు గానే, తనను తనప్రస్తుతస్థితికి తీసుకొనివచ్చే సదభిప్రాయంతోనే కృషిచేసినట్లు కనబడుతున్నారు.

నాన్న అన్నమాటలు అప్పుడు శూలాల్లాగ గుచ్చుకొంటేనేం? అవే తరువాత తనని హాస్యాస్పదంగా తయారవకుండా కాపాడేయి. తాను ఎన్నోమార్లు ఇబ్బందులపాలయి, కొన్నికొన్ని రోజులు భోజనానికి సైతం డబ్బులేక, ఏదో చవకరకం టిఫినుతినీ, స్నేహితుల ఇళ్ళలో భోజనాలవేళ మించిపోయేవరకూ (ఆ పూటకి అక్కడ తప్పనిసరిగా ఉండిపోమనే ఛాన్సు వస్తుందని) కాలాఖానీ చేసిన రోజుల్లో, వీథిలో చేబదుళ్ళిచ్చిన స్నేహితులను తప్పించుకొని తిరిగినరోజుల్లో, అంతే కాదు, ఎవడయినా స్నేహితుడు కొత్తగా పట్నం వస్తున్నాడంటే (కొత్తలో కొత్త పూటుగా ఉంటాడుగనక వాడితో ఒక పదిపదిహేనురోజులు హుషారుగా గడిచిపోతుందని) వాడికోసం ఎదురుతెన్నులు చూసినరోజుల్లో ఎన్నెన్నో మార్లు అనుకొన్నాడు, తిరిగివెళ్ళిపోవాలని. అయితే అటువంటి రోజుల్లో అంతటి నిరుత్సాహంలోనూ నాన్న నాడన్నటువంటి కటూక్తులే స్ఫుటంగా వినిపించేవి—అంత కఠినంగా

గాని ఆయన అనిఉండకపోతే, ఏముంది, తాను మరి నాలుగుమార్లు అటూ ఇటూ తిరిగి, చివరకి తన ప్రవర్తన తనకే అసహ్యంవేసి, తనకు అయిష్టమయిన ఏనౌఖరీలోనో ఇప్పటివరకూ కొట్టుకొంటూ ఉండిఉండును.

పైజ్ఞాపకాలతో వెలిపడి ఇంకొకటి అతని మనస్సును మెరసింది. ఆవేళ పోస్టాఫీసులో వైరు చేయాలని నిశ్చయించుకొనికూడా, ఎందుకు ఊరుకొన్నాడో, అప్పుడేగాని అక్కడ కిటికీదగ్గర అందరుమంది మనుష్యు లుండకపోతే—తాను వైరుచేసి ఉండేవాడేమో! వెంటనే నాన్న సరిగా కావాలన్న డబ్బుపంపిఉంటే,—తాను ఈ ఇంటికి ప్రస్తుతపు యజమానిగా, హైస్కూలులో మాష్టరుగానో, కలెక్టరుకచేరీలో గుమాస్తాగానో ఈపాటికి పదేళ్ళ అనుభవం సంపాదించిఉండును. ఏదో తిరిగివచ్చినంతలో స్థిరపడిపోతాడని నమ్మకం ఏమిటి? అదివరకెన్నిమార్లు జరిగింది కాదా విసంగా! భవిష్యత్తులాగే భూతాన్ని కూడా జరిగింది జరిగినట్లుగా కాక, ఆ ఒక్క ర్వంత అలా కాక ఇంకొకలా జరిగిఉంటే, తక్కినదంతా ఏవిధంగా జరిగిఉండేదీ అన్న విషయం ఇదమిత్థమని తేల్చబడదు.

రాఘవరావుకి తన కొత్తస్థితిలో ఆ పాతఇంట్లో ఎన్నడూ తెలియని, ఎంతో అభిమానం చూపే మనుష్యులమధ్య ఉండడం మేలుకొని ఉన్నా కలకంటున్నట్టే అనిపించింది. కొంతసేపు అలా కదలకుండా కుర్చీలో పడుకోవడంతో నిద్రపట్టిపోయింది.

అతనుభోజనం చేస్తూఉండగా ఇంటావిడ నాలుగు భోగట్టాలూ—ఇంటిపేరూ, పేరూ, ఎక్కడఉన్నదీ, ఏమిటి చేస్తున్నదీ అన్నీ సకృత్యంగా కనుక్కొంది. మొట్టమొదట, ఏదో చెప్పేద్దా మనిపించింది. కాని, అంతఅబద్ధం చెప్పవలసిన ప్రాణవిత్తమానభంగము లేవీ కావుకదా అని వినయంగానే, 'ఏదో సినీమాల్లో పని చేస్తూంటానండి' అన్నాడు.

'అలాగా నాయనా, మా అచ్యుతాని కదే లోకము. ఇరవై నాలుగ్గంటలూ అదే స్మరణ. వాటిలో వేషాలవీ వేస్తావా, మరేదో డైరెక్షనూ అవీనట—ఆపనా' అని నిలవేసి అడిగింది.

మంచినీళ్లు తాగి సర్దుకొని, 'రెండూ కొంచెం కొం'ం' అని చెయ్యి కడుక్కొండికి లేచేడు.

అంతసేపూ ఏదో పత్రిక చదువుకొంటున్న వాళ్ల అబ్బాయి అచ్యుతానికి ఒక్కమారుగా ఏదో వెండి కొండ తమ యింట్లోకి ఎగిరివచ్చినట్టయింది. కాదా మరి! ఊరంతటికీ తాను పేరుమోసిన సినీక్రిటిక్కా రౌను. తన వ్యాసాలు ఈ ఊకు బహుశః తెలిసేఉండవచ్చును. అయితే అవి 'కలంపేరు'తో ఉండడంవల్ల ఫలానా అని తెలియకపోవచ్చును. ఇట్టి పరిస్థితిలో సుప్రసిద్ధ సినీడైరెక్టర్ అండ్ ఆక్టర్ రాఘవరావు తనంతట తాను తన యింటికి ఈవిధంగా వచ్చి అతిథి అవడం కంటె గర్వకారణం ఇంకేముంటుంది! ఇందాకా తనకి కొంచెం అనుమానం తగలకపోలేదు. కాని, ఏదీ అనుకొందికి వీలయినా ఉంటేనా! పాదాచాక్కా పంచాను. అంతటివాడు ఇలా వస్తాడని తను ఎలా ఊహించగలడు!

కాని తనకు కలిగిన గొప్పతనాన్ని ఏవిధంగా వినియోగించుకోవడమో అచ్యుతానికి బోధపడింది కాదు. అలాగని ఊరుకొన్నాడా! రాఘవరావు పడుకొన్న వెంటనే బయలుదేరేడు సైకిలుమీద మిత్రమండలిని కలియడానికి. కాని, తీరా వెళ్లి నలుగురికీ తెలియజేసినతరువాత, తా ననుకొన్న సభాకార్యక్రమము అంతకంటె ఘనంగానే జరిగేటట్లు రూపించినా, వ్యవహారం తన చేతులలోనుండి చాలావరకు జారిపోయిన ట్లనిపించింది. కాదా మరి! రాఘవరావు మొదట్లో ఈ ఊరివాడుకదా! ఊళ్లోని పెద్దపెద్దలే అతిఉత్సాహంగా ఉన్నారు. ఎందరోమందికి పూర్వస్నేహితుడు. పైగా, చాలాకాలం శ్రమలతమాదులు పడిపడి ఇప్పుడిప్పుడే డబ్బూ, పేరుప్రతిష్ఠలూ సంపాదించినవాడుకదా రాఘవరావు.

విందు అద్భుతంగా జరిగింది. సభకికూడా ఏ మహాదేశీయనాయకులు వచ్చినప్పుడో వచ్చేటంతమంది ప్రజలు వచ్చేరు. అయితే అందుకు కొంతకారణం

మొదట తమ ఊరివాళ్లే నన్ను అభిమానమే అయి ఉంటుంది.

ఇదంతా రాఘవరావుకి బాగుంది అంటే బాగుంది, లేదు అంటే లేదు. మొదట్లో చాలా ఇబ్బందులు పడడంచేత నయితేనేమి, సహజంగా జాగ్రత్త అయినవాడు కావడంవల్ల నయితేనేమి, ఇటీవల తన డబ్బయితే నిబ్బరంగానే కనిపిస్తున్నదిగాని, తనకీర్తి ఇంత పరిమాణంలో ఉందని తెలియదు. ఎప్పుడూ ఏదో ఊపిరితియ్యడానికి వీల్లేనంత పని ఉండడమూ, తాను కలిసే మనుష్యులంతా తనవంటివాళ్ళే కావడమూ మూలాన ఏదో అనుకొనేవాడు తప్ప, ప్రజలు-ముఖ్యంగా తనఊరివారు ఇంతలా ఆత్మీయుడుగా భావించి అభిమానిస్తారనుకోలేదు. అక్కడివరకూ బాగానే ఉంది. కాని, తా నీఊరు రావడానికి గల ముఖ్యకారణం తలిదండ్రులను చూడడం కాలేదు. ఇక ఊళ్ళోనయినా ఏదో సామాన్యుడుగా ఆ పాతవీథులలో ఒంటరిగా వెళ్తూ, ఆ కాఫీహోటళ్ళూ, ఆ కిళ్లీ సోడా దుకాణాలూ, ఆ సినీమాహాలూ, ఆ టౌను హాలూ, లైబ్రరీ పార్కూ వీటన్నిటినీ గురించి పూర్వపుజ్ఞాపకాలన్నీ నెమరువేసుకొంటూ స్వేచ్ఛగా ఒకరి ప్రేక్ష్యం లేకుండా తిరిగి ఆనందించాలనుకొన్నాడు కాని, ఏదీ కాలయినా కింద దింపనిస్తేకదూ! ఒక్కక్షణమయినా తనని ఒంటరిగా విడిస్తేనా! స్నేహితులు, పరిచితులు! అభిమానము, ఆదరమూ వాంఛించదగినవేగాని ఇంత ఉక్కిరిబిక్కిరయితేమాత్రం భరించడం కష్టమే.

ఆసాయంత్రమే అనుకొన్న తన ప్రయాణం తరువాత నాలుగురోజులదాకా సాధ్యమయింది. అప్పటికీ ముఖ్యమిత్రులు కేశవరావు, నగేరాజరావు, శర్మ ఇష్టపడనే లేదు—మళ్ళీ తిరుగుదలలో దిగుతానని తనచేత మాటపుచ్చుకొని మరీ విడిచిపెట్టేరు. అయితే తాను కేవలం మిత్రుల పొగడ్తనూ, విందులనూ పొందుతో వ్యర్థంగా కాలక్షేపం చేసినట్లనుకోనక్కరలేదు. ముఖ్యమయిన వ్యవహారంకూడా ఒకటి సాగించేడు. తనను డైరెక్టరుగా, ప్రధానపాత్రధారుడుగా కోరినంత జీతం ఇవ్వడమే కాదు, తక్కిన పూచీ యావత్తూ తనమీద ఉంచుకొని చేసేటట్టయితే పెట్టుబడి ఎంతయినా సిద్ధమే అన్నారు, తన చిన్ననాటికి అస్వతంత్రులుగాఉండి, నేటికి స్వతంత్రులయి బాగా ఆర్జించిన ఇద్దరుముగ్గురు వణిక్ప్రముఖులు. సరిగ్గా రాఘవరావు అటువంటి మహత్తమసావకాశానికే ఎదురు చూస్తున్నాడు. అసలు ఈ ప్రయాణం ఇలా సందర్భించడం కేవలం తన కీసావకాశం కలగడానికే నేమో! ఇంతవరకూ, తనకు ఏవేవో చిన్నచిన్న అంశాలలో తప్ప, ప్రధాన కథావిషయంలోగాని, పాత్రధారుల ఎన్నికవిషయంలోగాని స్వాతంత్ర్యం లేదు. అయినప్పటికీ తన ప్రత్యేకత చూపేందుకు తానేమో తంటాలుపడకపోలేదు. కాని, ఇది తనకూ తన శక్తికీ తగిన సర్వోత్తమమయిన సావకాశం—దీన్ని అద్భుతంగా వినియోగించుకోవాలి. అలా అలా అతని మనస్సు కథనిగూర్చి, నటీనటులను గూర్చి, తాను ప్రత్యేకించి నృత్యంలో సంగీతంలో ప్రవేశపెట్టదలచిన వైలక్షణ్యాన్నిగూర్చి అల్లుకొనిపోతున్నది.

అంతా అద్భుతంగా ఉంది. ఇక ఆలస్యం లేకుండా వెళ్లి, అమ్మనూ నాన్ననూ తీసుకొని వెళ్లిపోయి పని ఆరంభించడమే.

తానేమో రైల్లోనే వెళ్తానన్నాడు. కాని, కేశవరావు ఒప్పుకోలేదు. 'అప్పూరు స్టేషనుకి పదిమైళ్లదూరం ఉంటుంది. బళ్లుకూడా దొరికిననాడు దొరుకుతాయి; లేనినాడు లేదు. ఇదివరలో బస్సు వెళ్తూండేది. అది ఈమధ్యనే ఆగిపోయింది. మాకారుమీద మధ్యాహ్నం కాఫీ తాగి బయలుదేరితే నాలుగున్నరకల్లా వెళ్లిపోవచ్చును—ఇదే ఉత్తమపద్ధతి. నువ్వు మరి కాదనకు' అన్నాడు.

'సరే, కాదననుగాని, నువ్వుకూడా వస్తావంటేనే' అన్నాడు రాఘవరావు.

'అలాగే, ఎప్పుడూ ఉన్న రోగాలేకదా' అని మొండికత్తి బయలుదేరదల్చుకొన్నాడు కేశవరావు.

కాని, సరిగ్గా వేళకు ఏదో ప్రసూతిసంబంధమయిన కేసు-ఒక్క అరగంటలో వచ్చేస్తానని వెళ్లాడు. కాని, అనుకొన్నంత సుళువుగా తెముల్తుందా? అక్కడనుంచే కబురు చేసేడు—ఈరాత్రికి ఉండిపోతే

రేపు ఇద్దరం కలిసి బయలుదేరవచ్చును. కాదంటే, మళ్లీ రాత్రయిపోతుంది, బయలుదేరి పొమ్మని. మరి రాఘవరావుపరిస్థితి ఆలస్యాన్ని సహించే స్థితిలో లేదు. అంతేకాక, తాను ఉండిపోతే, మళ్లీ రేపు ఎటువంటి తప్పనిసరి ప్రమాదకేసులను విడిచిపెట్టిరావలసి వస్తుందో కేశవరావు అని కారు తియ్యమన్నాడు వెంకట్రావుతో.

౫

కొత్తకోడలుసిగ్గుకంటె ముమ్మరంగా పూచాయి మామిళ్లు. కొన్నికొన్ని చెట్ల ఆకులే కనపడడంలేదు పూవులమాటున.

ఒండు విరిగి స్వచ్ఛంగా ప్రవహిస్తున్న ఏరూ, విశాలమయిన ఇసుకతిన్నెలూ, దూరాన అద్దరిని అస్తమిస్తున్న అరుణతరణిబింబము—రాఘవరావుకి తన ప్రయాణపు తొందర ఏమీ కనిపించలేదు. ఎంతో కాలంగా ఆప్రాంతాలతో సాంగత్యం ఉంటున్నట్లుగానే అనిపించింది. ఇందాకా కోయిల అలా వరసగా కొంతసేపు ఎంత తియ్యగా కూసింది! సినీమాల్లో కోయిలలూ కూస్తాయి, పావురాలూ ఎగురుతాయి, లేళ్లూ పరిగెడతాయి—అంతా నిజమే. అయితే అది చూసేవాళ్లకే. వాటిని కావలసిన పద్ధతుల్లో సమకూర్చి, తాపత్రయం పెట్టుకొన్న వాళ్లకి అవి ఏవో ఉపకరణాలుగామాత్రమే రూపిస్తాయి. ఇవాళ తనకు అటువంటి పూచీ ఏమీ లేదు. తాను కేవలం ప్రేక్షకుడు, శ్రోతమాత్రమే. అందులోనూ, ఇది ఏమీ, వెయ్యిమంది మధ్యను కూర్చొని కొనుక్కున్న టికెట్టుకి కిట్టుబడిగా చూస్తున్న సినిమా కాదు. తన ఆనందానికి ఏమి టభ్యంతరం? అలా మాటిమాటికీ ఆనందిస్తున్నానని జ్ఞాపకంచేసుకోవడం కూడా అవసరమే. లేకపోతే తనకుమాత్రం దాఖలా ఏమిటి?

రాఘవరావుకి ఏటినీ, ఇసుకతిన్నెలనూ, అస్తమయసమయారుణతరణిబింబాన్నీ అంత సుభావంగా కారులోంచి చూచివిడిచిపెట్టా లనిపించలేదు. కారు ఆపించి, జోళ్ళు కారులోనే వదలి, పంచె మీదికి కట్టుకొంటూ వెళ్ళి, మొగం కాళ్ళూ చేతులూ కడుక్కొని, చల్లగా పారుతున్న ఏటినీ, మెల్లగా వీస్తున్న గాలినీ ఆస్వాదిస్తూ నిలబడ్డాడు. ఇంకెంత, ఈఏటినీరే కదూ తాగుతారు? విశ్రాంతిజీవితం గడపడానికి అమ్మా, నాన్నా ఎంత మంచిప్రదేశం ఎంచుకొన్నారు! ఆ పట్టణంలో, ఆ మురికి వాతావరణంలో, ఆ దోమల సంగీతమూ, అనవసరమయిన గాభరా ఇవేవీ లేకుండా నిర్విచారంగా ఇంతటి సువిశాలసుందరప్రకృతిలో ఐక్యమై నివసించడమే నిజమైన కళాదృష్టి అనుకొన్నాడు.

ఎన్ని మెలికలు తిరిగింది ఈకొంచెంమేరలోనూ ఏరు. అదుగో ఆమద్ది చెట్లవరసల మధ్యనుంచి వెళ్లుదాం. చిన్నచిన్న ఇళ్ళూ, కొబ్బరి చెట్లూ! అదేనట—చిన్న ఊరే—అంతా ఒక మూడుగందల గడపకంటె ఎక్కువ ఉండ దన్నాడు కేశవరావు—వాడుకూడా వచ్చి ఉంటే చాలా హుషారుగా ఉండి ఉండును.

తన చిన్నతనంలో నాన్న ఎప్పుడో ఏడాదికి ఒకమారు వెళ్ళి సిస్తు అరవై రూపాయిలూ వసూలు చేసికొనిరావడం తప్పిస్తే, తన కీ ఊరుగురించి మరేమీ తెలీదు. డ్రైవరు వెంకట్రావు తొందరపడుతున్నట్లున్నాడు. అదిగో అతనూ దిగివస్తున్నాడు—పిలవడానికే కాబోలు. ఎందుకు తొందర? దగ్గరలోనే ఉంది కదూ-ఏం వెళ్లిపోలేకపోతామా? ఇన్ని సంవత్సరాలలో లేనిది ఈ కొద్దిక్షణాలలో తొందర దేనికి?—అయితే తనిప్పుడు ఇక్కడ ఏమిటి చేస్తున్నాడు? ఏమీ లేదు. ఏమిటో తనకే తెలియకుండా అలా ఇసుకలో కూర్చున్నాడు.

మరి సూర్యబింబం కొండలమాటున కనబడ లేదు. నడిఆకాశాన ఇంతసేపూ వెలవెలబోతూన్న రాజముఖం ఇప్పుడిప్పుడే కలకలలాడుతూంది.

కారు మళ్లీ బైలుదేరింది. 'దారి ఇక్కడే కొంచెం సవ్యంగా లేదు. కాని, ఫర్వాలేదు, వెళ్లిపోతుంది. కిందటిమారు డాక్టరుగారు వచ్చినప్పుడు నేనే డ్రైవుచేసేనని హామీ ఇస్తున్నాడు వెంకట్రావు.

మరీమరీ దగ్గరకు వస్తున్నకొద్దీ అతని మనస్సు, చేసినవిధాన చేయకుండా తల్లిదండ్రుల ప్రస్తుతస్థితిని

గురించి ఊహచేస్తున్నది. అంతలోనే, ఎలాగూ కలుసుకొంటున్నాముకదా ఎందుకాందోళన అని అదే సర్దుబాటు చెయ్యడానికి చూడసాగింది. ఇంకా అతని మనస్సు ఎంతో దూరంగా ఉండి ఆలోచిస్తూఉండగానే కారు ఊళ్లో ప్రవేశించింది.

ఆ సమయంలో అదివర కెవరూ అనుకోకుండా కారు రావడం ఊళ్లో కలిగించవలసిన అలజడిని బాగానే కలిగించింది.

పోలీసులు మొదలయినవాళ్లు రావడానికి ఊళ్లో కొట్లాటలు మొదలయిన వేవీ తాత్కాలికంగా లేవు. ఇక కాంగ్రెసునాయకులో ఎవరో అంటే, ముందుగా పదిపది హేనురోజులనుండి అట్టహాసం జరగడం, రెండు మార్లు అనుకొన్నవాటికి రావడం కుదరక తరవాత ఎలాగో దర్శనం ఇవ్వడం జరుగుతుంది. ఇక, మిగిలి ఉన్నది ఒక్కటే సావకాశం. కరణంగారింటికి అప్పుడోకమారు వచ్చేరు, పట్నంనుండి డాక్టరుగారు. కారుకూడా ఆయనదానిలాగే ఉంది. కాని వారింట్లోనూ ప్రస్తుతం ఏమీ వైద్యసహాయం అవసరం లేదే. ఇంతకీ కారును పోలిన కారుండకూడదా?

ఊళ్లోని వివిధపార్టీల చర్చా కూడాలు; పెద్దలు మాత్రం నిశ్చలంగానే ఉన్నా, కుఱ్ఱకారుమాత్రం కారుచుట్టూ మూగి, యథాశక్తి యత్కించిత్ భోగట్టాకోశాన్ని వెనుకవున్న ఇతరులకి అందిస్తున్నారు. ఏమయినా ఏదో కారణం అంటూ లేందే కార్యం (కారు రావడం) ఎందుకు జరుగుతుందీ అని మీమాంస.

రాఘవరావుకి కారులో బయలుదేరడానికి అట్టే ఇష్టం లేకపోవడానికి ఇటువంటి అలజడిని గూర్చిన అనిష్టమే కొంత కారణం. తాను అనుకొన్నట్టుగానే ఉంది. ముందు తానే దిగి ఏ ఇల్లో కనుక్కొందాం అనుకొన్నాడు కాని, కారుచుట్టూ ఉన్న ప్రజని చూసేక గాభరాగా తోచి వెంకట్రావుతో, 'వెంకటనరసింహంగారు ఆయన పేరు—ముసలాయన. పట్నంలో గుమాస్తాపని చేసి, రిటైరయి వచ్చేరు. వారిల్లు ఎక్కడుందో కనుక్కొంటే' అన్నాడు. ఇంకా వెంకట్రావుప్రశ్న సగం నోట్లోనే ఉంది; కొందరు 'ఇలా వెళ్లి కుడిచేతివేపు తిరిగితే అడ్డువీథిలో ఆఖరిఇల్లు. ముందు పిట్టగోడ, గేటు ఉంటాయి. వేరే, దేనితోటి కలియకుండా ఉంటుంది' అని మార్గం సూచించేరు. మరికొందరు తమలో తాము 'ఊళ్లో ఉన్న వాళ్లఘోషే వరసయ్యపంతులు కక్కర్లేదు. అతన్తో ఏంపనో' అని చర్చిస్తున్నారు. సన్నని దారిలో మెల్లగా దారి చేసుకుంటూ నడుస్తున్న కారుధ్వనిలోగాని, ఇతర గల్లంతులోగాని మునిగిపోకుండా స్ఫుటమయిన స్త్రీకంఠము ఒకటి వినిపించింది రాఘవరావుకి. 'అతని కొడుకే కాబోలర్రా, ఆ సుశీలమ్మ మాఅన్నయ్య మాఅన్నయ్య మద్రాసులో ఉన్నాడంటుంది.' అని వినిపించింది.

'అయితే మరేం, బాగుంది. చెల్లెమ్మకూడా ఇక్కడే ఉందన్నమాట' అని ఉల్లాసంతో పల్లవించింది అతని మనస్సు అకొద్దిసేపటిలోనే.

అదుగో అదే—గుర్తులు సరిగానే ఉన్నాయి. ఇల్లు ఒక్కటే ఉంది. చుట్టూ అట్టే ఎత్తులేని మట్టిగోడ—లోపల ఏ వేవో మొక్కలు. అసలు ఇల్లు అన్న కట్టడం కొంచెం దూరంగా ఉంది. తలుపు పిలవాలి—ఏమని పిలవడం?

కారు దిగి ఏదో సందేహం తోచినట్లుగా 'అయితే కారెక్కడ ఉంచుతావు? అయినా ఇక్కడి ఈ వ్యవహారం రేపల్లా పడుతుంది కాబోలు. ఇప్పుడు బోంచేసి నువ్వు వెళ్లిపోతేనే మంచిది. అవతల మళ్లీ వాడికి (కేశవరావుకి) అవసరం ఉంటుందేమో' అన్నాడు.

వెంకట్రావు వినయంగానే 'అక్కర్లేదు బాబూ. మాపంతులుగారు ఒకటిరెండురోజులకి మరేం తొందర లేదనే చెప్పేరు. మళ్లీ తమరు బయలుదేరేదాకా ఉండమని చెప్పేరు. కారు కరణంగారి పెంకుటిసాలలో పెట్టేస్తాను' అన్నాడు.

'సరే, అలాగే. ఈ హోల్డాలూ, సూటుకేసూ ఇంట్లో పెట్టేసేక నువ్వు ఇది అక్కడ ఉంచేసొస్తావు' అన్నాడు రాఘవరావు.

‘ఇక్కడ మా మేనమామగారి కుటుంబము ఉన్నారు సార్. చిన్నప్పుడు మామామే నన్ను పెంచి చదివించేరు. నే నక్కడికి వెళ్లిపోవాలి’ అని కొంచెం ఆగి ‘తలుపు పిలవమన్నారా?’ అన్నాడు — రాఘవరావు మొగమాటపడుతున్నాడేమోనని అనుమానించినట్లుగా.

‘ఎందుకూ, నేనే పిలుస్తా’ నన్నాడు రాఘవరావు. అమ్మా, అమ్మా!...తన గొంతు తనకే చిత్రంగా వినిపించింది. ఉఁ హుఁ. బాగా లోపల ఉన్నారు కాబోలు. తట్టాలి, తలుపు మరికొంచెం గట్టిగా తట్టాలి—‘అమ్మా, అమ్మా’

‘ఎవరు, అన్నయ్యా! అన్నయ్యా! ఎన్నాళ్లకి’ అని తనతో మరి మాట్లాడకుండా ‘అమ్మా! అమ్మా! అన్నయ్య వచ్చేడమ్మా!’ అంటూ లోనికి పరుగెత్తినంత తొందరగా వెళ్లింది.

రాఘవరావుకి ఒక్కమారుగా తల దిమ్మెక్కిపోయినట్టయింది. ఆమె ‘అన్నయ్యా’ అని ఉండకపోతే, ఆమే సుశీల అని తాను పోల్చుకోలేకపోయి ఉండును. పాపం, ఎన్నాళ్లయిందో వైధవ్యం సంప్రాప్తించి. ఛా! తానెంత మూర్ఖుడు. కఠినుడు! వీళ్ల ప్రసక్తే లేకుండా స్వార్థంగా తన తాపత్రయం తాను పడుతూ కూర్చున్నాడు. కాక తను చెయ్యగలిగిందేమిటి? తను దగ్గరుంటేమాత్రం చనిపోయే మనుష్యులను బ్రతికించి ఉంచగలడా? కాకపోతే తాను దగ్గర ఉండి ఓదార్పుమాటలు చెప్పవచ్చును. పాపం, ఎల్లా అయిపోయిందో, తనకంటె కూడా పెద్దగా ఉన్నట్టుంది. అలా అడుగులో అడుగు వేసుకుంటూ లోపల ప్రవేశించాడు. తన వెనకాతలే హోల్డాలూ సూట్‌కేసూ పట్టుకొని వస్తున్నాడు వెంకట్రావు.

రాఘవరావుకి ఇంకొక భయం వేసింది. ‘అమ్మా, అమ్మా’ అని సుశీల లోపలికి పరుగెత్తింది కదా, నాన్న ఏరీ? ఏమిటి కొంపతీసి...అఁహఁ, అప్పే తాఁ వట్టినే భయపడుతున్నాడు. ఇందాకా వినబడిన గొంతుకలలో వరసయ్యబాబు ఊళ్లో వాళ్లతోనే మాట్లాడ దన్నట్టుగా వినిపించింది. మరేం భయంలేదు—అదుగో అమ్మా, సుశీలా వస్తున్నారు. నాన్న ఎక్కడికో వెళ్లి ఉంటారు, అంతే—

అతనికి వెంకట్రావు దగ్గర్లో ఉండడం కూడా కొంచెం ఎబ్బెట్టుగా తోచింది. ‘మరి నువ్వు ఉండ నంటున్నావుకదూ, అవి అక్కడ ఉంచి వెళ్లమ్మా? ఉదయం కలుస్తావుకదూ? రేపు సాయంత్రంలోగా బయలుదేరేమాటయితే. బాధలేదు—లేకుంటే నువ్వు కారు తీసుకొని వెళ్లిపోవచ్చును’ అన్నాడు.

"తొందర్లేదు సార్, తమ పని పూర్తయేదాకా ఉండమన్నారు మాపంతులుగారు. ఉదయం మళ్లీ దర్శనంచేస్తాను—నమస్కారం"అని శలవు తీసుకొన్నాడు.

‘నాయనా నాయనా! రాఘవులు వచ్చేడు’ అంటూ అమ్మ రెండుచేతులూ పట్టుకొంది. తనకి కళ్లనీళ్లు ఎందుకు వచ్చేయో! అప్పే! మరి నిరోధించాలని ప్రయత్నంచేసి లాభంలేదు.........ఎలాగో సర్దుకొని, గొంతు తెమల్చుకొని, లోపల ధైర్యంగా ఉన్నా, ఏదో మూలనించి వస్తున్న అనుమానాన్ని వదలించుకొందికి ‘నాన్న ఏరీ?’అన్నాడు అతిఅసహజమయిన గొంతుతో.

ఏదో మరిచిపోయినట్లుగా సుశీల ‘నాన్నా? పెరట్లో పెయ్యని విప్పుతున్నారు. ముందు అమ్మకి నిన్ను చూపించాలని అమ్మని తీసుకొనివచ్చేను—నాన్నని పిలుస్తా’ నంటూ మళ్లీ పరుగెత్తింది సుశీల.

రాఘవరావుకి తా నెదుర్కొవలసిన విషాద ఘటనలకి ఒకమితి ఏర్పడిందికదా అని నిబ్బరం కలిగింది. పక్కనున్న నులకమంచంమీద అమ్మను కూర్చోపెట్టి పక్కను తానూ కూర్చొని, గద్గదితమయిన గొంతుతో, ‘అమ్మా! నిజమేనమ్మా! నాది తప్పే. మీ రిబ్బందులు పడుతూ ఉంటే, ఏవో స్వప్రయత్నాలకోసం తాపత్రయపడుతూ, మీసుఖం సంగతి చూడలేకపోయేను... అమ్మా, అమ్మా! ఇన్నాళ్లూ ఎటువంటి చిక్కులు పడ్డారో, ఇక మీదట......’అని ఇంకా ఏమో అనబోతూ ఉండగా ‘మా కష్టసుఖాల మాటకేం? ముసలాళ్లం, ఎలా గడిచి

పోయినా గడిచిపోయిందే—నువ్వు ఎన్ని ఇబ్బందులు పడినా కొసని కాస్త సుఖపడగలిగితే మాకంతే చాలును' అన్నాడు అప్పుడే వచ్చి పక్కనున్న కఱ్ఱ బల్లమీద కూర్చుంటున్న వెంకటవరసింహంగారు.

చిత్రమే—ఈ సుమారుపదహారుసంవత్సరాల లోనూ, నాన్న శరీరంలో అట్టే మార్పు లేదు—అప్పటి కంటె ఇప్పుడే ఆరోగ్యంగా ఉన్నట్టుంది. కాని గొంతుకలో మాత్రం ముసలితనం బాగా వచ్చేసింది.

రాఘవరావుకి ఏమిటి మాట్లాడాలో, ఏమిటి మాట్లాడకపోవాలో ఏమీ స్ఫురించకుండా ఉంది. ఏమాట అనదలచుకొన్నా ఎవరో దూరపుబంధువులతో ముందుగా అనాలని అనేసుకొన్న మాటలులాగే తోచసాగాయి. కాని ఊరుకుంటే ఎలాగ? అతిప్రయత్నం మీద, 'ఇన్నాళ్లూ మీరు చిక్కులుపడితే అందుకు పూర్తిగా బాధ్యత నాదే. అయితే ఇకమీదట నిర్విచారంగా ఉండవచ్చును. అసలు ఏడాదికిందట రావ్దా మనుకొన్నాను. కాని, నేనే రావాలనుకొంటూ, తెరిపి చేసుకొనేసరికి ఇన్నాళ్ళయింది' అన్నాడు.

వెంకటవరసింహంగారు పైమీదిగావంచాతో మొగం తుడుచుకుంటూ 'పోనీ, ఎన్నాళ్లకయినా నువ్వు వచ్చి కంటపడ్డావు. దానికి (మీఅమ్మకి) నిన్ను చూడకుండా చచ్చిపోతా నేమోనని మనోవ్యాధయి పోయింది-ఏదో ఉత్తరంముక్క రాసిపడేయకుండా, నువ్వే రావడం క్షేమయిన పని చేసేవు. ఉత్తరం రాస్తే ముసలివాళ్లం కదలలేము, మానలేము—బయల్దేరాలంటే నానాశ్రమాను. అందులో రైళ్లు ఇప్పుడు మరీమరీ ఇరకటంగా ఉంటున్నాయిటకదూ—' అని, 'ఇప్పుడే వస్తాను. పెయ్యని కట్టేయకపోతే పిరాలు కొరికేస్తుంది' అంటూ పెరట్లోనికి వెళ్లేడు.

అమ్మకూడా లేచింది 'అన్నం చిమిడిపోతుందేమో' అంటూ. 'నేను వెళ్తాను, నువ్వు కూర్చో అమ్మా' అంది సుశీల. 'ఎందుకు? నువ్వు కూర్చొని, అన్నయ్యతో మాట్లాడుతూఉండమ్మా' అని, రాఘవరావుతో, 'నాయనా! నువ్వు కంటబడ్డావు. ఇక నేం విచారం లేకుండా చచ్చిపోగల్ను. భగవంతుడు దాన్నే అర్ధాన్నం చేసేసేడు. నాలుగేళ్లయినా నిండా సంసారం చెయ్యలేదు' అని ఆవిడ మరి మాట రాక లోనికి వెళ్లిపోయింది.

తనపనీ అంతలాగే ఉంది. చెల్లెల్ని ఓదార్చాలనీ, ఏవేవో మాటలు చెప్పాలనీ ప్రయత్నం చేస్తున్న కొద్దీ తన కన్నీళ్లు మరీ ఎక్కువవుతున్నాయి. రాఘవరావు అప్పట్లో అనుకోకపోయినా, ఏవేవో పాడిపాడి మాటల కంటె ఆ కన్నీళ్లే నిజమయిన ఓదార్పేమో.

అంతలో తండ్రి రావడం తప్పనిసరిగా వాస్తవికజగత్తులో పడ్డాడు రాఘవరావు. చెల్లెమ్మ లోనికి వెళ్లిపోయింది.

'ఇందాకా పెయ్యని విప్పుతో ఉంటే ఎవరిదో కారు ఇలా వచ్చిందన్నాడు సుబ్బిగాడు. అంతమీద వచ్చే వేమిటి? రైలయితే రాత్రి ఏతొమ్మిదిగంటలకో గాని రాదుకదా?'

'అయినా నేను రయిలుమీదే వద్దా మనుకున్నాను.'

'ఊఁ'

'అయితే అసలు మీ రిక్కడ ఉన్నారనే నాకు తెలీదుకదూ. పాతఇంటికి తిన్నగా వెళ్లేను. అక్కడ ఊళ్లో వాకబుచేస్తే తెలిసింది. అక్కడ డాక్టరు కేశవరావు ఉన్నాడు కదూ - వాడే చెప్పేడు. రాత్రి పదిగంటల ప్రాంతంలో రయిలుదిగితే బళ్లుకూడా ఉంటాయో ఉండవో, పదిమైళ్లు నడిచివెళ్లాలని—అయినా బాధ లేదన్నాను నేను. కాని, తనకారుమీద వెళ్లక తప్పదని బలవంతం చేసేడు. అతనూ కలిసివద్దా మనుకొన్నాడు. కాని, వీలయింది కాదు.'

'అలాగా, అతగాడికీ నీకూ అంత స్నేహమన్న మాట?'

'అప్పటి స్నేహమే. నేను అక్కడికి వెళ్లిన తరవాత మీరు ఇక్కడున్నారని తెలిసినతరవాత వెంటనే ఆ సాయంత్రమే ఇక్కడికి వద్దామనుకొన్నాను. కాని, ఏవో సభలనీ, మరికొన్ని వ్యవహా

రాలనీ ఈ నాలుగురోజులూ కదలనియ్యలేదు అక్కడి వాళ్లు.'

'ఏదో ఇంతకీ వచ్చేవు, అక్కడ లేమని తెలియగానే తిరిగి వెళ్లిపోకుండా'—అని వంటింటివేపు తిరిగి, 'ఔనే, అబ్బాయి ఆకలిపడి ఉంటాడు. కొంచెం వేగం తెమలనీ' అంటూ, ఇంకా ఏవేవో వంటవిషయంలో సలహాలు చెప్పడానికి కాబోలు వెళ్లేరు వెంకటనరసింహంగారు.

రాఘవరావుకి అత్యంతాశ్చర్యకారణం అయింది తండ్రిముఖభావం. తనను చూసి తండ్రి మిక్కిలి ఆనందించడమో, లేక పూర్వపుస్థితిగతుల నన్నిటినీ జ్ఞాపకం చేసుకుని, ఇప్పటికీ తాను మునపటిలాగే నిరర్థకంగా ఉంటున్నాడని తలచి కోప్పడడమో జరుగుతుం దను కొన్నాడు. కాని, చిత్రం, ఆయనకు తన ప్రసక్తే అట్టే కావలసినట్లు లేదు. ఎక్కడ ఉన్నావు, ఎలా ఉన్నావు, ఏమిటిచేస్తున్నావు, ఏమిటికథ—ఏ ప్రశ్నా లేదు. ఎవడో దారంట వెళ్లిపోతున్న బంధువు ఆ పూటకి భోజనానికి వస్తే చేసినట్లు కుశలప్రశ్న చేసి ఊరుకోవడం—పూర్వపు ఆ మనిషేనా ఈయన—ఎంతమార్పు తీసుకొనివచ్చింది కాలం—

పోనీ ఆయన చెప్పినట్లుగానే ముసలివాళ్లు ముసలివాళ్లే. చెల్లెమ్మ హాయిగా ఉందా? పాపం ఆమెగతి అల్లా అయిపోయింది. అమ్మలో మునపటి ఆకళే లేదు. ఎంత బలహీనంగా ఉంది, ఎంత ముసలిదయిపోయింది; అంతా ఈ పదమూడేళ్లలోనే—

'అన్నయ్యా, మంచినీళ్లు తాగుతావా, ఒక్క క్షణంలో వంట అయిపోతుందిగాని, దాహం వేస్తున్న దేమో!' అని అందించింది.

'అట్టే దాహంగా లేదు, ఇందాకా ఏటిదగ్గర కారు దిగి నీళ్ళుతాగేను. కాని, తే' అని పుచ్చుకొని...'కూర్చో చెల్లెమ్మా' అన్నాడు.

ఇందాకటిలాగ, ఏమిటి మాట్లాడ్డం అన్న సమస్య రాకుండా, చెల్లెమ్మే అందించింది సూత్రం.

'కారులో వస్తే నీ స్వంతమే అనుకొన్నా నన్నయ్యా' అంది.

అమ్మయ్య! మరి బాధ లేదు. ఏదో పైవాళ్ల దగ్గరయితే గొప్ప చెప్పుకోడం గాని, ఇంట్లోవాళ్లకి అసలు తెలియవలసిన సంగతి తెలియకపోతే ఎలాగ అనుకుంటూ మొదలుపెట్టేడు.

'కారు లేకేం? అక్కడ ఉంది. అప్పుడు నీతో నిష్కర్షగా చెప్పేశాకదమ్మాయి, ఒక మూడు వేలయినా సంపాదించందీ తిరిగిరానని. ఇన్నాళ్లకి కాలం, పరిస్థితులు కలిసివచ్చేయి-నేను కేవలం నాటకాలలోనే హైటికి రావాలనుకొన్నాను—కాని సినీమాలలో పడవలసివచ్చింది. కాని, ఇందు కేం విచారించవలసినట్టు కనబడడంలేదు. ఇప్పటికి అంతా ఒక యాభైవేలకి లోటు లేదు. ఇప్పుడు మొన్న అనుకొన్నవ్యవహారం గాని స్థిరపడితే మళ్లీ సంవత్సరానికి రెండు లక్షలకి లోటుండదు. ఇప్పటిమట్టుకు మంచి బంగాళా అద్దెకి తీసుకొన్నాను. మళ్లీ సంవత్సరానికి ఒకటి స్వంతంగా కొనేసుకొంటాను' అని ఆగేడు.

'వారు అప్పుడే తెలుసునన్నయ్యా, నువ్వింత వాడి వవుతావని.. కాని, ఇన్నాళ్లూ నీభోగట్టాయే మాకు తెలీదు. పోనీ ఇన్నాళ్లూ ఉత్తరమయినా రాసేవా ?'

'ఏదీ అంతా సరీగా లేఖ తిరిగి, ఈ రెండున్నర ఏళ్లకంటె ఎక్కువ కాలేదు. ఎన్నోమార్లు ఉత్తరం రాయాలనుకొన్నానుగాని, అదేమిటో అదోకలాగ వెల్తిగా తోచేది ఉత్తరం రాయడం అంటే—'

'అవునులే అన్నయ్యా, నువ్వు ఇలా రావడమే ఎంతో బాగుంది. ఏదో ఉత్తరం రాసి పడేస్తే మరి గాఢరాగా ఉండును. మొత్తానికి అప్పుడు నీ గురించి నువ్వూ నేనూ కన్నకలలు నిజమయే యన్నమాట—'

'అవునమ్మాయి, అసలు మనం అప్పుడు కనిన కంటె కూడా ఉజ్జ్వలంగా నిజమయేయి—నువ్వు ఈ మధ్యను పత్రికలూ పేపర్లూ అవీ చూడడంలేదూ ?'

'లేదన్నయ్యా, అప్పుడు కొన్నాళ్లు శ్రద్ధగా చదివేదాన్ని. తరవాత మరి ఇక్కడికి వచ్చేక ఏదో కాలక్షేపం జరిగిపోతున్నది; మరి పత్రికల అవసరమే

కనబడలేదు. అయినా కొంతకాలం, నాటకాలగురించి, ఈ నాట్యకళగురించి ఏమయినా భోగట్టా లుంటా యేమోనని చూసేదాన్ని. తరువాత తరువాత వాటి మీదా విసుగుపుట్టింది. ఎప్పటికయినా స్వయంగా అన్నయ్యే వస్తాడు, లేక ఉత్తరంఅయినా వస్తుందని నా నిబ్బరం. పోస్టుమేను వారానికి బీటుకి వస్తే ఏమిటో ఆశగా ఉండేది. ఇన్నాళ్లకి, ఆ ఆశ అనుకొన్నకంటె బాగా నిజమయింది' అని కొంచెం ఆగి పంకేయిస్తూ, 'అన్నయ్యా! మరి నువ్వు...' అని ఇంకా ఏమో అన బోతుండగా, లోపలనుంచి, వెంకటనరసింహంగారు, 'తరవాత, భోజనం అయేక మాట్లాడుకోవచ్చును. ఇవ తల వడ్డించేస్తున్నది. రా అమ్మాయి, అన్నయ్యకి కాళ్లు కడుక్కోందికి నీళ్లూ గావంచా ఇయ్యమ్మా. వాడికి పట్టుపంచ కట్టుకొనే అలవాటు లేదు కాబోలు. ఆ పంచతోనే కూర్చోనీ' అన్నారు ఒకే బిగిని.

వంకాయ మెంతిపెట్టిన కూర, అప్పడాలు, కంది పచ్చడి, చారు...ఆహాహా ఏనాటి రుచులు! రాఘవ రావుకి అన్నీ అమృతోపమానంగా ఉన్నాయి. నాన్న ఏదో కూరలో లోపం ఉందంటున్నారు అమ్మతో, తనకిమాత్రం కూర దివ్యంగా ఉంది. ఆకలి లేక పోయినా, ఇటీవల అలవాటుపడినకంటె ఎక్కువగానే తినగలిగేడు. అమ్మమాత్రం తాను ఏమీ సరిగా తినలే దనే వాపోతున్నది. నాన్న 'వాడు తినలేనంటే అట్టే బలవంతంచెయ్యకు. కావలిస్తే, వాడికేం, నీదగ్గర మొగమాటమా?' అన్నారు......అసలు మొగమాటం లే దన్న ఈ మాటే తనని ఎంతో దూరస్థుణ్ణి చేసినట్టని పించింది రాఘవరావుకి—నాన్న శరీరం అయితే అట్టే జారిపోలేదుగాని, భోజనశక్తి తగ్గినట్టే ఉంది; అప్పుడు ఏడాదికి ఒకనాడుకూడా తడపని పొత్తి పంచ కట్టుకొనేవారు. ఇప్పుడు మడిగావంచా కట్టుకున్నారు. ఇందాకా తాను సరిగా చూడలేదు, మెడలో రుద్రాక్షతావళంకూడా ఉంది. పగలు జపం కూడా చేస్తున్నారేమో?

భోజనా లయేక, సుశీలతో తనకు ఎక్కడ ఏవిధంగా పక్క వేయవలసినదీ చెప్పి, పెరట్లో పశువు లకి గడ్డి వేసుకొందికి కాబోలు వెళ్లిపోయేరు.

పూర్వం నాన్న వేసుకొనే పెద్దమంచం మీద—అది మిద్దిగదిలో ఉంది. ఎలాగో సుశీలని ఒప్పించి, ఇందాకటి నులకమంచంమీద తన హోల్డాలు పరిచేడు రాఘవరావు.

రాఘవరావు నిద్రపోదామని ఎంతమాత్రమూ అనుకోలేదు. కాని అదివరకు రెండురాత్రులుగా స్నేహితులూ, పేకాటావూలంగా ఏమీ నిద్రలేక పోవడంచేత, అమ్మా, చెల్లెమ్మా భోజనంచేసి తక్కిన సర్దుబాటు చేసుకొని వచ్చేలోపునే అతనికి నిద్ర పట్టి పోయింది.

రాత్రి లేకపోయినా తెల్లవారుజామున కొంచెం చలి లేకపోలేదు అన్నట్టుగా తన ప్రభావం చూపిస్తూంది. నాన్న చదువుకున్న కృష్ణకర్ణామృతం శ్లోకాలూ, భాగవతంలోనిపద్యాలూ వీటివో తనకు తెలివి వచ్చింది. తన శరీరం నరనరాలలోనూ ఏదో విద్యుత్కిరణము ప్రసరించినట్లయింది. ఆ తెల్లవారు జాముప్రశాంతిలో ఆ ముసలికంఠంనుండి రావడం శ్లోకాలు మరీ పవిత్రంగా, తానూ నిజంగా ఒక భక్తు డయినట్లుగా, ఇంతకంటె అనుభవనీయమయిన ఆనం దము ఏముంటుం దన్నట్లుగా అనిపించింది రాఘవ రావుకి.

నాన్నకి తన ఉద్యోగం ఏమిటో తన బాగోగు లేమిటో విచారించే ఓపిక లేకపోయిందిగాని, ఉదయం పళ్లు తోముకొంటున్నంతసేపూ పెరట్లోని పువ్వుల మొక్కలూ కూరగాయల మొక్కలూ పాదులూ పండ్ల చెట్లూ వీటిగురించి ఆయన చెప్పిన ధోరణి చూస్తే ఆయనకి అవన్నీ ఏవో కాలక్షేపసాధనా లన్నట్లు కంటె, అవన్నీ ఒక్కనిమిషమయినా విడవలేని ప్రాణ మిత్రులలాగ కనిపిస్తున్నా యనడమే ఎక్కువ సబబుగా ఉందనుకోవచ్చును. ఇంత అభిమానం కలిగిన ఈయన ఈ చెట్ల కాయలూ పళ్లూ ఏవిధంగా కోయగలుగు తున్నారో?

ఉదయం నిద్ర లేవడం, కాఫీ అయినా తాగ కుండా, ఆవులపని చూసుకొని అవసరం ఉంటే పొలానికి వెళ్లడం, లేకుంటే ఏదో అలా తోటపని

చేస్తూనే పదకొండుపన్నెండుగంటలవరకూ కూర్చోవడం, అప్పుడు నూతినీళ్లు తోడుకొంటూ పక్కా అరగంట స్నానంచేసి, జపంచేసుకొని అప్పుడు భోజనం! భోజనానంతరం ఒక్క అరగంట చిన్నకునుకు—మళ్లీ సాయంత్రం చీకటిపడేదాకా తోటపనే. మళ్లీ అప్పుడు భోజనం. అంతే, మధ్యను మరేమీ లేదు. కాబట్టే, ఈవయస్సులోసైతం జిర్రుమని చీదకుండా ఆరోగ్యంగా ఉండగలుగుతున్నారు.

అప్పుడు తన చిన్నతనంలో 'అయ్యోయ్యో, కాఫీకింద ప్రతినెలా ఇంతఖర్చు అయిపోతున్నదే' అని వగస్తూఉండడమూ, మళ్లీ ఏఒకనాడయినా పాలు రావడం ఆలస్యం అయేసరికల్లా ఎంతో చంచలంగా ఉండి బాధపడడం, అంతకంటె ఇది వెయ్యిరెట్లు నయం. అంతే కాదు. అప్పుడు ప్రతివారితోనూ అవసరం ఉన్నా లేకపోయినా ఎంతో మాట్లాడేవలసి. ఇప్పుడెవరితోనూ తనకేమీ సంబంధం లేదన్నట్లుగా ముక్కుకి సూటిగా తనపని తాను చేసుకోవడం ఎంతయినా వాంఛనీయమే.

కాని, రాఘవరావుకి ఉదయం కలిగిన తృప్తీ, ఉత్సాహమూ సాయంత్రానికి నిలవలేదు. ఇన్నాళ్లూ యీముగ్గురూ డబ్బు ఏమీ సంపాదించలేకపోయినా, నిత్యకృత్యానికి లోటులేకుండా ఒకరిని యాచించకుండా గడుపుకొని వచ్చేరు. బాగానే ఉంది. కాని, ఇప్పుడసలు మొదటికే మోసం వచ్చేటట్టుందే.

చెల్లెమ్మకి సంతోషమే: తాను బాగా ఆర్జించేడని—అంతేగాని, అది ఉపయోగించాలని కోరికేమీ ఉన్నట్టు లేదు. అసలు మధ్యాహ్నం మొక్కలకి నీళ్లు తోడుతూఉండగా నాన్నతో చెప్తే, నాన్న ఒక్కక్షణం తన పని ఆపి 'నాకు ముందే తెలుసునమ్మాయి, వాడు వచ్చేడంటేనే ఒక లక్షకి పైమాటే అనుకొన్నాను' అని మళ్లీ తనపనిలో పడ్డారు. హుఁ, ఆ గురివిగాడు వెధవ ఏతాం తొక్కుతూ ఉంటే తానే స్వయంగా తోడుకుంటున్నారు. వాడితో వంకాయలగురించీ, మామిడిపువ్వుగురించీ, చిక్కుడుపాదుగురించీ, ఎత్తావుపెయ్యగురించీ మాట్లాడ్డంలో ఉన్న ఆనందం ఆయనకు తన ఆర్జనగురించీ, కష్టసుఖాలగురించీ ఉన్నట్టు లేదు.

ఆయనను ఈప్రదేశంనుండి కదిలించడమే ఒక పెద్ద ఘట్టమయే లాగ కనిపించింది రాఘవరావుకి. పోనీ ఇక్కడే అంత తృప్తిగా ఉంటే, ఈ యిల్లు పడగొట్టించి, లేక ఈప్రక్కనే విశాలంగాఉన్న జాగాలో చక్కటి ఎత్తయిన పెద్దయిల్లు కట్టించుకొని హాయిగా ఉండదలచుకొన్నా తనకి తృప్తిగా ఉంటుంది. అసలు ఈసుఖానికి ఏమిటి అర్థమో, కొంపతీసి తనమీద మునపటి స్వేచ్ఛాప్రియత్వానికి కోపం తీర్చుకోడం కాదు కదా! అబ్బే, అలాగేం ఉన్నట్టు లేదు. అసలు, ఇన్నాళ్లు డబ్బులేకుండా, లేదన్న పెద్ద విచారం లేకుండా, ఇక్కడి కివే మేలన్నట్లుగా చేసుకొన్న అలవాట్లలోనే ఉంది పొరపాటంతాను. ఆయనకి ఆ పశువులపనీ, ఆ గొప్పు తవ్వుకోడం, నీళ్లు తోడుకోవడం అవే ఏవో గొప్ప ఆనందసాధనాలుగా కనిపిస్తున్నాయి—ప్రపంచంలో మరే యితర ఆనందదాయకమయిన పనీ లేనట్టు.

వీళ్లు తనతో అక్కడకు రాకపోయి, ఇక్కడయినా తన డబ్బును ఉపయోగించుకోవడం అంటే అంతకూ ఇష్టపడకపోయేమాటయితే, మరి తన డబ్బుకి సార్థక్యం ఏముంది? వృథాయేకదూ? తా నిన్నాళ్లూ అహర్నిశాదులు ఎవరిని తృప్తిపరచడమయితే లక్ష్యంగా పెట్టుకొని ఆర్జించాలనుకొంటున్నాడో, వాళ్లకే అక్కర్లేకపోతే తన డబ్బు ఉంటేమి, లేక ఏమి?

అయితే అలవాట్లు ఎంత బలంగా ఉంటేమాత్రం—వాతావరణమూ పరిస్థితులూ మారితే వాటంతట అవే మారిపోవూ? అక్కడ సినీమాలూ, నాటకాలూ, పాటకచేరీలూ, పత్రికలూ, పుస్తకాలూ వీటిలో మాత్రం మనిషికి ఆనందించదగిన అలవాట్లు కలిగించుకొండికి వీలులేదా? ఏదయినా ముందు ఇక్కణ్ణించి కదిలితే తక్కినవాటిసంగతి తరవాత ఆలోచించుకోవచ్చును.

చెల్లెమ్మకూడా తన ఇష్టంప్రకారం జరిగేందుకు ప్రయత్నించకపోలేదు. కాని, ఆమెకూడా

సాధ్యమయేలా లేదు. అసలు అమ్మకికూడా కదలడం అంటే ఇష్టం ఉన్నట్టు లేదు. 'ఎందుకు నాయనా ముసలివాళ్లం, మా కేముంది? ఎక్కడున్నా ఒక్కటే. నువ్వే అప్పుడప్పుడు వస్తూఉంటే అంతకంటె మా కేం కావా'లంటుంది.

ఇదివరకల్లా, తాను కనబడడమే తడవుగా, నీటిలో మునిగిపోతున్న మనుష్యులు ఆధారంగా వేసిన తాడును పట్టుకొన్నట్టు అవలంబనంగా పట్టుకొంటా రనుకొన్నాడు. ఈవిషయంలో అతనికి అన్యథా జరగ డానికి సావకాశం ఉందనే స్ఫురించలేదు.

అలా ఇసుకలో కూర్చొనికూర్చొని మరీ ఆలో చన తోచక ఏట్లో దిగి మొగం కడుక్కొని నీళ్లు తాగేడు. నీళ్లు రుచిగానే ఉన్నాయి కాని నిన్నటి ఆ మాధుర్యం లేదు. అవును మరి,నిన్నటికి తన మనస్సులో కేవలం ఉత్సాహమే; ఎటువంటి అనుమానస్పర్శా లేదు. అందుకే ప్రకృతి అంత రమ్యంగా కనిపించి ఉంటుందేమో? ఊళ్లోకల్లా ఉన్న మంచినీళ్లనుయ్యి తమఇంట్లోదేనట—తక్కినవాళ్లందరూ ఏటి నీళ్లు తెచ్చుకున్నా తమయింట్లో నూతినీళ్లే తాగుతారు. తనకుమాత్రం అవి తియ్యగా లేవు. నిన్నసాయంత్రం 'ఆహా ఈప్రాంతాలలో ఉండడం ఎంతటి కళాదృష్టి' అనుకొన్నాడు తాను—కాని, నిత్యమూ ఇక్కడే ఉంటే తనకూ ఏమీ ఆనందం కనిపించకపోతుం దేమో—నిన్నటికీ ఇవాళకీ ఇంత భేదం ఉంది. నాన్నకి ఇల్లూ పొలంతప్ప తక్కిన ప్రపంచందృష్టే ఉన్నట్టు లేదు. అంతే కాబోలు మనిషిపద్ధతి—ఎంత విశాలమయిన చోట ఉన్నా అందులో ఒక గిరి గీసు కొని ఇదే నాది అనుకొని తాపత్రయపడుతూం డడం.

'ఎందుకమ్మాయి, ముసలివాళ్లం మేం ఎక్కడ ఉంటే నేమి! మా కిప్పుడేం కావాలి? అభివృద్ధి పొందవలసినవాడు వాడు. వాడు సుఖంగా ఉంటు న్నాడు. ఇక మేం అటూ ఇటూ ఎందుకు తిరుగుతూ ఉండడం? మే మింక బ్రతికినంతకాలం మరి బ్రతకం—మమ్మల్నిలా వెళ్లిపోనీండి'—ఇదీ నాన్న పల్లవి. ఏమిటి లాభం ??

అమ్మయ్య! ఎలాగయితేనేం, నాలుగురోజులకి ఒప్పుకొన్నారు. ఇంతకీ ఏమిటి? చెల్లెమ్మ బలవంతం చేతా, తాను వాళ్లు రాందే మరి కదలనని పట్టుపట్టడం చేతాను.

రాఘవరావు ఆనందానికి మేర లేదు. ఇన్నాళ్లు తాను ఆర్జించిన ఆ డబ్బుకి సద్వినియోగం జరుగుతుం దన్న తృప్తి ఆ క్షణాన్నే కలిగింది రాఘవరావుకి.

కాని, రాఘవరావు పైవిధంగా ఆనందించే డంటే అతన్ని అత్యల్పసంతోషి అనిమాత్రమే మనం అనాలి. ఏమంటే అది అట్టేకాలం నిలబడలేదు.

తిరిగి పట్నం రాగానే కొత్తగా తాను తీయ వలసిన సినీమానుగూర్చిన పనిలో అతిఉత్సాహంగా లీనమయిపోవడంవలన సరిగా తాను గుర్తించలేదు.

నాన్నకు ఈ పువ్వులతోటా, ఈపనిమనుష్యులూ, ఈపద్ధతీ ఏమీ నచ్చలేదు. అంతా డబ్బుతో వ్యవ హారం—ఏదో తెచ్చిపెట్టుకొన్నట్టుగానే ఉంటుంది. అయినా ఇక్కడ తాను స్వయంగా ఏపనీ చేసుకో బట్టెట్టు లేదు. అక్కడ తన మొక్కలూ అవీ ఎలా ఉన్నాయో! పాపం, ఆవుల సంరక్షణ ఎలా జరుగు తూందో? పెద్ద ఆవు ఈనవలసిన రోజులు—సరివిగాడు దగ్గరఉండి చెప్పి చేయిస్తే మంచి వాడే—అన్ని పనులూ చేస్తాడు. కాని వాడికి స్వయంగా ఏమీ తోచదు; పైగా మాలెడ్డ మందమతి—ఒక పని చేసేడో లేదో, మరొక్కగడియ పోయేక వాడికే తెలీదు. వాడి అజమాయిషీలో తక్కిన పసువులూ, పొలమూ ఎలా ఉన్నాయో? తోటలో మామిడి పింజలు ఈపాటికి పెద్దవయిఉంటాయి—ఇంట్లో మనుష్యులు లేకపోతే, ఊరిగుంటలంతా ఎగబడతారు. ఈపాటికి రెండు అరటిగెలలు ముదిరిఉంటాయి-అంతా అక్కడ ఎలా గుందో!...

ఆయనకి కొడుకు తెచ్చే వేలకివేలూ, కారూ, ఎలెక్ట్రికుదీపాలూ, ఫేనులూ, సినీమాలూ, పత్రికలూ, పుస్తకాలూ, విశాలమయిన శుభ్రమయిన బంగాళా పిటిపేటిమీదా కలగని కాపీనమూ, స్వంతమనే భావమూ అక్కడి ఆచిన్నయింటిమీదా, ఆ నాలుగు

పశువులమీదా, ఆ నుయ్యీ ఆ చెట్లూ వాటిమీదా—అంతే కాదు, ఆ అలవాట్లమీదా కలిగింది. ఇక్కడమాత్రం ఆయనను ఎవరయినా జపంచేసుకో వద్దన్నారా? నుయ్యిదగ్గర స్వయంగా తోడుకొని పోసుకొంటేనేతప్ప ఆయనకు స్నానం చేసినట్టే ఉండదుట—బాత్ రూమ్‌లో స్నానంచేసేక మరి జపం చేసేదేమిటి లెద్దూ అన్నట్టుంటుందట. ఏమి చేమిటో! మనిషికి అలవాటు అదొక పెద్ద సంబంధం—సుమారు పన్నెండుసంవత్సరాల ఎడతెగని గాసుగ అలవాటు ఒక్కమారు మారిపోతుందా? మారితే మాత్రం సుఖంగా ఉంటుందా?

కాని వెంకటనరసింహంగారికీ కొంత లౌక్యం తెలియకపోలేదు. ఆయన తిరిగి స్వగ్రామానికి బయలుదేరడానికి పైకారణాలు ఏవీ చెప్పలేదు. కామేశ్వరమ్మగారికి పట్నంవచ్చినదగ్గరనుండీ ఏమిటో సరిగా అన్నం అరగటంలేదు. కొంచెంకొంచెం జ్వరంకూడా వస్తోంది. మరేముందీ, డాక్టరుకూడా ఇక్కడ నీరూ గాలీ పడ లేదనీ, వాతావరణంమార్పు అవసరమనీ సలహా ఇచ్చేడు. ఇక మరి ప్రయాణాని కభ్యంతరం ఏముంది?

రాఘవరావు నచ్చ చెప్పాలని చాలా చూసేడు. అక్కడ వైద్యసహాయం లభిస్తుందా అన్నాడు—మరొకటి కాదు మరొకటి కాదు—ఎన్నయినా కారణాలు చెప్పేడు. ఎన్ని చెప్తేనేం, అసలు నిశ్చయంచేసుకొన్న మనుష్యులకి కారణాలతో ఏంపని?

చివరికి బయలుదేరేముందు చెల్లెమ్మతో, 'ఇన్నాళ్లూ అంటే ఏదో సాధించాలనీ, లక్ష్యమనీ ఉండేది. ఇప్పుడు మరేముంది? ఇంటికి వచ్చేసరికి నేనొక్కణ్ణే ఉంటే ఎలా గుంటుందో ఆలోచించు. నువ్వయినా ఉండకూడదా?' అన్నాడు. అతని మాటల్లోని బాధ సుశీలకి అర్థంకాకపోలేదు.

'అయ్యో, ఉండ లేమిటన్నయ్యా! అమ్మకి వంట్లో బాగున్నాక నువ్వెప్పుడు రమ్మంటే అప్పుడు వస్తాను, మరెక్కడ ఉంటాను నేను'—అని, అంతలో ఊరుకోక—

'ఈలోపున నీపెళ్లి అయితే మేం ముగ్గురమూ వస్తాము' అంది సోల్లాసంగా.

'నా పెళ్లా? హుఁ, దానికేం' అని రాని నవ్వు తెచ్చుకొంటూ, 'కనిపెంచినవాళ్లను ఇంత సుఖపెట్టేనుగనుక ఇక కట్టుకొన్నవాళ్లను ఆనందింపజేయడానికి పెళ్లి ఒక్కటి తరవాయి ఉంది. నాదబ్బు కర్ణుడి అస్త్రాలలాంటిది. ఉహుఁ, కర్ణుడి అస్త్రాలు ముందు ఉండి వేళకు ఉపయోగానికి రావు. నాదబ్బు అలా కాదు. మొదటల్లా లేకపోయి, అవతల అవసరం మరి లేదన్న సమయంలో వచ్చింది' అన్నాడు.

'నువ్వలా అనుకో కన్నయ్యా! మనుష్యులకు ఉన్నదే తృప్తి—మనమట్టుకు మనకి కష్టంగా తోచని మనపని చేసుకోడంలో తప్పేముంది? ఆయన ఎక్కడిష్టముంటే అక్కడుంటారు. నీమూలంగా ఆయనకు ఇప్పుడెంత తృప్తిగా ఉందో నీకు తెలీదు. మరి యీ సంవత్సరంలోనే నీపెళ్లి అయిపోవాలన్నయ్యా—నాన్నకూడా ఇదే అన్నారు' అంది.

రాఘవరావుకి నోటి-చివరివరకూ వచ్చింది నువ్వు మళ్లీ పెళ్లిచేసుకుంటేనే నేనూ చేసుకొంటా ననాలని. కాని, ధైర్యం చాలింది కాదు.

తరవాత చివరివరకూ అతనికి లోపల్లోపల బాధగా ఉండేది. వాళ్లకు ఆ ప్రశాంతమయిన జీవితమే సుఖప్రదంగా ఉండవచ్చును. కాని వాళ్లు పట్టణ జీవితంలోని సౌకర్యాలు అరుచికరం అయేంత సుదీర్ఘ కాలం తాను అర్జించలేకపోవడం తన లోపం కాదనుకోడ మెలాగు? పోనీ, ఓ రెండుమూడు వేలయినా దగ్గర ఉండనీయకూడదా అంటే, 'నాకే కావలిస్తే నీకు రాయనుట్రా? ఎందుకు—ఇంట్లో ఉంటే దొంగ వెధవల భయం ఒకటి' అంటారు నాన్న.

అతని పెళ్లిమాత్రమే తల్లిదండ్రులు చూడగలిగేరు—మనవలను ఎత్తుకునే అదృష్టం లేకపోయింది ఇద్దరికీని. ఒక్క పదిహేనురోజుల వ్యత్యాసంలో ప్రశాంతంగా దాటిపోయేరు భౌతికజగత్తును.

సుశీల వచ్చేసింది. తనతో మాట్లాడినంతసేపూ ఉత్సాహంగానే ఉన్నట్టుంటుంది. కాని, తను లేకపోయేసరికల్లా ఎప్పుడూ ఏవో నాన్న సంపాదించిన పురాణాలు, భగవద్గీత అవే చదువుకుంటూఉంటుంది. ఒక్క పూటే భోజనం. మధ్యమధ్యను ఉపవాసాలున్నా. ఏమన్నా సరే, 'నా కిలాగే బాగుందన్నయ్యా, నువ్వేమీ నాగురించి ఆందోళనపడకపోతేనే నాకు తృప్తి' అంటుంది. కాలదోషంవల్ల తానూ ఒకనాడిలాగే తయారవుతాడేమో అనిపిస్తుంది రాఘవరావుకి.